నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా - 'టీఎస్ ఆర్టీసీ'లో కొత్త పథకం - సజ్జనార్

హైదరాబాద్, మార్చి 5:తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ గా ఆర్టీసీలో పలు కీలక సంస్కరణలు తీసుకువచ్చే దిశగా దూసుకెళ్లుతున్నారు సజ్జనార్. కాగా టిఎస్ ఆర్టీసీలో త్వరలోనే ఓ కొత్త పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్విట్టర్‌లో ఓ ఫొటోను పోస్ట్ చేసిన సజ్జనార్ ? ఈ ఫొటో ఎక్కడిది? అంటూ ఓ పోల్ క్వశ్చన్ మాదిరిగా ట్వీట్ చేశారు. ఈ ఫొటోపై చాలా మంది స్పందిస్తూనే ఉండగా.. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కోసం.. ప్రత్యేకించి బాలికల కోసం ఆర్టీసీలో ఉచిత ప్రయాణం లాంటిదేమైనా ప్రకటించనున్నారా? అంటూ ఓ నెటిజన్ అడిగారు. దీనికి సజ్జనార్ వెంటనే స్పందిస్తూ.. ఓ పథకాన్ని రూపొందిస్తున్నామని, త్వరలోనే ప్రకటిస్తామంటూ సమాధానం ఇచ్చారు. ఆ కొత్త పథకం ఏమై ఉంటుందన్న దానిపై ఇప్పుడు చర్చ జరుగుతోంది.

హైదరాబాద్ ఆదివారం 6-3-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 179 పేజీలు: 4 వెల: రూ.1/-

హెల్త్ ప్రొఫైల్ ద్వారా ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం : మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, మార్చి 5 (నేటినిజం ప్రతినిధి): హెల్త్ ప్రొఫైల్ ద్వారా ఆరోగ్య తెలంగాణ నిర్మించి, దేశానికే ఆదర్శవంతం కావాలి. ఇందుకోసం కేటాయించిన ప్రతి పైసా సద్వినియోగం చేసుకుందామని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. వేములవాడలో హెల్త్ ప్రొఫైల్ పైలట్ ప్రాజెక్టును మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు.

రాష్ట్రంలో రెండేండ్ల కింద తొలి కరోనా కేసు నమోదైన నాటి నుంచి వైద్యారోగ్య సిబ్బంది అహర్నిశలు శ్రమించారని కేటీఆర్ కొనియాడారు. వారందరికీ మనం రుణపడి ఉండాలి. కరోనా సోకిన వారికి వైద్య సేవలందిస్తూ.. వైద్యులు, ఇతర సిబ్బంది తమ కుటుంబాలను మరిచిపోయారు. పారిశుద్ధ్య సిబ్బంది, పోలీసులు లాక్ డౌన్ కాలంలో తీవ్రంగా శ్రమించారని ప్రశంసలు కురిపించారు

రాష్ట్రంలోని ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతోనే ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ ప్రక్రియ చేపట్టామని కేటీఆర్ తెలిపారు. ప్రతి ఇంటికి వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది వెళ్లి.. వైద్య పరీక్షలు నిర్వహించి, ఆ వివరాలను ట్యాబ్‌లో నమోదు చేసుకుంటారు. రక్త పరీక్షల కోసం నమూనాలను సేకరించి, సిరిసిల్ల టీ డయాగ్నోస్టిక్‌కు సెంటర్‌కు పంపిస్తారు. ఆ పరీక్షల వివరాలను కూడా నమోదు చేసుకుంటారని తెలిపారు. ఏ ఒక్కరు కూడా ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదు. హెల్త్ రికార్డులు సక్రమంగా నిర్వహించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు, అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు ఎమర్జెన్సీ సమయంలో ఉపయోగపడుతాయన్నారు. అలాంటప్పుడు రోగి వేలి ముద్ర లేదా ఐరిష్‌తో అన్ని రికార్డులు, వివరాలు తెలుసుకుని వెంటనే చికిత్స ప్రారంభించవచ్చు. అత్యవసర సమయంలో, విలువైన అర గంట సమయం కూడా వృధా కాకుండా ప్రాణం కాపాడడానికి ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా ములుగు, సిరిసిల్ల జిల్లాల్లో ప్రారంభిస్తున్నామని తెలిపారు. 60 రోజుల అనంతరం మిగతా జిల్లాల్లో అమలు చేస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

సిరిసిల్ల ప్రాంతంలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్నట్లు ఓ సర్వేలో తేలిందని కేటీఆర్ తెలిపారు. కొంతమంది బీడీ కార్మికులు క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు తెలిసిందన్నారు. ఇలాంటి రోగాలను నివారించేందుకు హెల్త్ ప్రొఫైల్ సర్వే ఉపయోగపడుతుందన్నారు. అవసరమైతే ఇక్కడ క్యాన్సర్ కేర్ సెంటర్, మరో చోట కార్డియాక్ సెంటర్ నెలకొల్పే అవకాశం ఉందన్నారు. డేటా ఆధారంగా, సహేతుకమైన నిర్ణయాలు తీసుకోవచ్చు. హెల్త్ ప్రొఫైల్ ద్వారా ఆరోగ్య తెలంగాణ నిర్మించి, దేశానికే ఆదర్శవంతం కావాలి. ఇందుకోసం కేటాయించిన ప్రతి పైసా సద్వినియోగం చేసుకుందామని కేటీఆర్ చెప్పారు.

నేడు మెట్రో రైల్ ప్రాజెక్టును ప్రారంభించనున్న ప్రధాని మోదీ

ముంబై, మార్చి 5:: ప్రధాని నరేంద్ర మోదీ మార్చి 6న పుణే మెట్రో రైల్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నారు. మెట్రో రైల్ ప్రారంభంతో మెట్రో రైలు సేవల కార్యకలాపాలు లాంఛనంగా ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేస్తారు.

పుణే మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రధాని ఆవిష్కరిస్తారు. 9.5 అడుగుల ఎత్తుతో ఈ విగ్రహాన్ని పీఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఇక 11.30 గంటలకు పుణే మెట్రో రైలు ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తారు. మెట్రో రైలు రాకతో పుణేలో అర్బన్ మొబిలిటీ కోసం అంతర్జాతీయ శ్రేణి మౌలిక ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది.

ఇక ఈ ప్రాజెక్టుకు 2016 డిసెంబర్ 24న ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. పుణే మెట్రో మొత్తం 32.2 కిలోమీటర్ల పరిధిలో నిర్మితమవుతుండగా 12 కిలోమీటర్ల మార్గాన్ని మోదీ ప్రారంభించనున్నారు. రూ 11,440 కోట్లకు పైగా నిధులతో ఈ ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. గర్వారే మెట్రో స్టేషన్ నుంచి ఆనంద్ నగర్ స్టేషన్ వరకూ ప్రధాని మోదీ మెట్రో రైలులో ప్రయాణిస్తారు.

నాసిన్ భూమి పూజలో పాల్గొన్న నిర్మలా సీతారామన్

అనంతపురం, మార్చి 5:: జిల్లా పరిధిలోని పాలసముద్రం గ్రామంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, పరోక్ష పన్నులు, నార్కోటిక్స్ అకాడమీ (నాసిన్) భూమి పూజలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. 500 ఎకరాల విస్తీర్ణంలో ఈ సంస్థను నెలకొల్పుతున్నారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం రూ.730 కోట్లు కేటాయించారు. మధ్యాహ్నం బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్.. అక్కడి నుంచి అనంతపురం జిల్లాకు రోడ్డు మార్గాన చేరుకున్నారు. అనంతరం నాసిన్ భూమి పూజలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన్న, ఆర్‌అండ్‌బీ మంత్రి ఎం శంకరనారాయణ, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, కేంద్ర ఆర్థిక మంత్రి పర్యటనలో ప్రోటోకాల్ వివాదం తెరపైకి వచ్చింది. ఆహ్వానపత్రంలో తన పేరు లేదని ఎంపీ గోరంట్ల మాధవ్ ఫిర్యాదు చేయగా.. మరో ఎంపీ తలారీ రంగయ్య ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందలేదని హాజరుకాలేదు.

ఈ సంస్థలో ఐఆర్ఎస్‌కు ఎంపికైన ప్రొబేషనరీ అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు. ఈ ప్రాజెక్టుకు రెండోసారి భూమి పూజ జరుగుతున్నది. 2015 ఏప్రిల్‌లో ఏపీ సీఎంగా చంద్రబాబు హయాంలో తొలిసారి అప్పటి కేంద్ర మంత్రులు వెంకయ్యనాయుడు, అరుణ్ జైట్లీ భూమి పూజ చేశారు. ఏడేండ్ల తర్వాత మళ్ళీ ఇదే సంస్థకు కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ భూమి పూజ చేయడం విశేషం.

కబడ్డీ ఆడిన మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత

వరంగల్, మార్చి 5::: ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నర్సంపేటలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీల్లో టీఆర్ఎస్ పార్టీ మహిళా నేతలు పాల్గొని ఆడారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత ఒక టీంలో ఉండగా, వరంగల్ రూరల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి మరో టీం తరపున ఆడారు. వీరు కబడ్డీ ఆడుతున్నంత సేపు గ్రౌండ్ అంతా కేరింతలతో మార్మోగింది. మంత్రి సత్యవతి రాథోడ్ కబడ్డీ ఆడి అందర్నీ ఆశ్చర్యానికి గురి చేశారు.

చరిత్రలో నేటినిజం



కం॥ తాత్కాలికమౌ సుఖశిఖా
స్ఫుర్తిని గుర్తించకనుచు శోభామయుగా
మూర్తిభూతవనుచునా
ప్రార్థించుచు నుంటి నేను "కృష్ణకుమారి"న

(మార్చి5 నటి కృష్ణకుమారి జయంతి...) -రాధశ్రీ సెల్: 9494481210

తెలంగాణ బడ్జెట్ సమావేశాలకు ఏర్పాట్లు పూర్తి

హైదరాబాద్, మార్చి 5:: తెలంగాణ బడ్జెట్ సమావేశాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ పరిసరాల్లో పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. ముఖ్యమంత్రి, స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వీరి పీఏలు, ఇతర సిబ్బందికి కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశారు. అసెంబ్లీ ఆవరణలో సైన్ బోర్డులు ఏర్పాటు చేసి.. ఎవరికీ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.

బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, శాసన మండలి ప్రొటెం ఛైర్మన్ సయ్యద్ అమీనుల్ ఉన్నతాధికారులతో శనివారం ఉదయం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, లెజిస్లేటివ్ సెక్రెటరీ డా. వి. నరసింహా చార్యులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా స్పీకర్ పోచారం మాట్లాడుతూ.. ఈ నెల 7 నుంచి రాష్ట్ర రెండో శాసనసభ 8వ సెషన్, శాసనమండలి 18వ సెషన్ సమావేశాలు ప్రారంభం అవుతున్నాయని చెప్పారు. గత సమావేశాలు సజావుగా జరుగడానికి సహకరించిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. గత సమావేశాల్లో మాదిరిగానే అధికారులు సహకారం అందించాలని కోరారు. గౌరవ సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలన్నారు.

గత సమావేశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు జవాబులను వెంటనే పంపించాలని సూచించారు. కరోనా ప్రభావం తగ్గినప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆరోగ్యశాఖ అధికారులు కరోనా టెస్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. శాసనసభ, మండలి సమావేశాలు సజావుగా సాగేందుకు పోలీస్ శాఖ వారు పూర్తి సహాయ, సహకారాలను అందించాలని కోరారు.

జెలెన్‌స్కీ రెచ్చగొట్టాడు- అందుకే అణు ప్లాంట్‌పై రష్యా దాడి: ఉక్రెయిన్ మాజీ ప్రధాని

కీవ్, మార్చి 5: ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ రెచ్చగొట్టడం వల్లనే కీలకమైన జపోరిజియా అణు విద్యుత్ ప్లాంట్‌పై రష్యా దాడి చేసిందని ఆ దేశ మాజీ ప్రధాని మైకోలా అజరోవ్ ఆరోపించారు. రష్యా మీడియా స్పుత్నిక్‌తో ఆయన మాట్లాడారు. ఐరోపాలోనే అది పెద్ద న్యూక్లియర్ పవర్ ప్లాంట్ అని, ఇందులో ఆరు విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు ఉన్నాయని తెలిపారు. అలాంటి చోట కాల్పులకు ఉక్రెయిన్ లేదా రష్యా సైనికులు సాహసం చేయరని చెప్పారు. అయితే ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ రెచ్చగొట్టడం వల్లనే అక్కడి శిక్షణా కేంద్రం నుంచి జరిగిన స్వల్ప కాల్పులు ఏకంగా అణు విద్యుత్ ప్లాంట్‌పై దాడికి పురిగొల్పిందన్నారు. ఇది ఖచ్చితంగా రెచ్చగొట్టే కుట్ర అని, అమెరికా, బ్రిటన్‌కు జెలెన్‌స్కీ తప్పుడు సమాచారం ఇచ్చి రష్యాను రెచ్చగొట్టేలా వ్యవహరించారని ఆయన విమర్శించారు.

కాగా, ఉక్రెయిన్‌పై బాంబులతో విరుచుకుపడుతున్న రష్యా శనివారం తాత్కాలికంగా విరామం ఇచ్చింది. పోర్ట్ సిటీ మరియుపోల్, వోల్నావఖా పట్టణాలను రష్యన్ బలగాలు చుట్టుముట్టాయి. ఈ నేపథ్యంలో ఆ రెండు నగరాల నుంచి పౌరులను సురక్షితంగా తరలించేందుకు అవకాశం కల్పించింది. మాస్కో కాలమానం ప్రకారం శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు ఈ కాల్పుల విరమణ అమలులో ఉంటుందని రష్యా రక్షణ శాఖ ప్రకటించింది.

నేడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు.. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు అమలు

హైదరాబాద్, మార్చి 5: నగరంలో ఈనెల 6న నిర్వహించనున్న షీ టీమ్స్ రన్ నేపథ్యంలో హైదరాబాద్ సిటీ పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. 5కె, 2కె రన్ నిర్వహించనున్న పీపుల్స్ ప్లాజా నుంచి లేపాక్షి, ట్యాంక్ బండ్, పీవీఎన్ఆర్ మార్గ్ ప్రాంతాల్లో ఉదయం 5 నుంచి 8 గంటల వరకు ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

నెక్లెస్ రోడ్డు రోటరీ నుంచి ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ మీదుగా షాదాన్ కాలేజ్, నిరంకారీ భవన్ మీదుగా మళ్లిస్తారు. అదేవిధంగా ఇక్బార్ మినార్ నుంచి అప్పర్ ట్యాంక్‌బండ్ వచ్చే వాహనాలను తెలుగు తల్లి ఫ్లై ఓవర్ మీదుగా మళ్లిస్తారు. లిబర్టీ నుంచి వచ్చే వాహనాలను అంబేద్కర్ విగ్రహం వద్ద మళ్లించి తెలుగుతల్లి ?ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లేలా ఏర్పాటు చేస్తారు. సంజీవయ్య పార్కుకు వచ్చే వాహనాలను నల్లగుట్ట జంక్షన్ నుంచి రాణిగంజ్ ఎక్స్‌రోడ్డు మీదుగా అనుమతిస్తారు. 5కె, 2కె రన్ నేపథ్యంలో ఎం.ఎస్.మక్తా, ప్రసాద్ ఐ మ్యాక్స్ ఎదురుగా, డాక్టర్స్ కార్ పార్కింగ్, ఎంఎంటీఎస్ నెక్లెస్ రోడ్డు, లేక్ పోలీస్ స్టేషన్ పక్కన ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.

షెల్టర్లలో ఉండండి, జాగ్రత్తలు తీసుకోండి- సుమీలోని భారత విద్యార్థులకు సూచన

కీవ్, మార్చి 5:: ఉక్రెయిన్‌లోని సుమీ కాల్పుల మోతతో మారుమోగుతోంది. దీంతో అక్కడున్న భారత విద్యార్థుల క్షేమంపై కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటన జారీ చేసింది. కాల్పుల తీవ్రత వల్ల అక్కడి నుంచి భారత విద్యార్థుల తరలింపును వాయిదా వేసినట్లు తెలిపింది. అయితే కాల్పుల విరమణ కోసం భారత ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని వెల్లడించింది. అప్పటి వరకు విద్యార్థులు బాంబు షెల్టర్ల లోపలే ఉండాలని, ముందస్తు భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. కాగా, ఉక్రెయిన్‌పై రష్యా దాడి నేపథ్యంలో సుమీ ప్రాంతంలోని భారత విద్యార్థులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్నారు. ఆహారం, నీరు లేక అల్లాడిపోతున్నారు. మంచు గడ్డలను మంటతో కరిగించి ఆ నీటిని తాగుతున్నారు. తమను వెంటనే అక్కడి నుంచి తరలించాలని కన్నీళ్లతో వేడుకుంటూ భారత ప్రభుత్వానికి ఎస్ఓఎస్ వీడియో సందేశాలు పంపుతున్నారు.

ఈ నేపథ్యంలో కేంద్రం వీటిపై స్పందించింది. సుమీలో కాల్పుల విరమణ కోసం భారత ప్రభుత్వం గట్టిగా ఒత్తిడి తెస్తున్నదని తెలిపింది. కాల్పుల విరమణ ప్రకటించగానే విద్యార్థులను అక్కడి నుంచి తరలిస్తామని పేర్కొంది. ఈ లోపు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, షెల్టర్ల లోపలే ఉండాలని సూచించింది.

తిరిగి డ్యూటీలో చేరిన డీజీపీ మహేందర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 5:రెండు వారాల మెడికల్ లీవ్ తరువాత తిరిగి డ్యూటీలో చేరారు తెలంగాణ రాష్ట్ర డీజీపీ మహేందర్ రెడ్డి. ఈ ప్రకటనని ఆయనే స్వయంగా తెలిపారు. ఐపీఎస్ అధికారిగా నియామకం అయిన తర్వాత మొట్టమొదటి సారిగా ఇదే తన మెడికల్ లీవ్ అని అన్నారు. ఎప్పుడూ ఒక్కరోజు కూడా మెడికల్ లీవ్ పెట్టలేదని.. ఇప్పుడే రెండువారాలు లీవ్ పెట్టానని మహేందర్ రెడ్డి వెల్లడించారు. కాగా రెండు వారాల క్రితం బాత్రూం లో కాలు జారి పడ్డ డీజీపీ మహేందర్ రెడ్డి రెండు వారాల పాటు లీవ్ పెట్టారు.

ఉక్రెయిన్‌లో రష్యా తాత్కాలిక కాల్పుల విరమణ

హైదరాబాద్, మార్చి 5:ఉక్రెయిన్‌లో బాంబులతో విరుచుకుపడుతున్న రష్యా (ఖీబీబబతిజీ) తాత్కాలికంగా కాల్పులను విరమించింది (అవజీబవటతీవ). పోర్ట్ సిటీ మరియుపోల్, వోల్నావఖా పట్టణాలను రష్యన్ బలగాలు చుట్టుముట్టాయి. అయితే యుద్ధ క్షేత్రం నుంచి పౌరులను తరలించేందుకు అవకాశం కల్పించింది. మాస్కో కాలమానం ప్రకారం శనివారం ఉదయం 10 గంటల నుంచి ఐదున్నర గంటలపాటు కాల్పులను విరమిస్తున్నట్లు (అవజీబవటతీవ) రష్యా రక్షణ శాఖ ప్రకటించింది.

హ్యూమన్ కారిడార్ కోసం వోల్నావఖా, మరియుపోల్‌లో కాల్పులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని తెలిపింది. ఈ సమయంలో ప్రజలకు ఆహారం అందించనున్నారు. దీంతోపాటు ప్రాథమిక చికిత్స చేయనున్నారు. దీంతోపాటు రెండు పట్టణాల్లో విద్యుత్, నీటి సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నది.

గత పదిరోజులుగా ఉక్రెయిన్‌పై రష్యా బాంబుల వర్షం కురిపిస్తున్నది. ఇప్పటికే ఖేర్సన్ నగరంతో అణువిద్యుత్ కేంద్రాలైన చెర్నోబిల్, జపోరిజియా పవర్ ప్లాంట్‌ను తమ ఆధీనంలో తీసుకున్నది. రాజధాని కీవ్‌పై బాంబుల దాడిని ఉధృతి చేసింది. ఉక్రెయిన్ బలగాలు ప్రతిగటిస్తుండటంతో కీవ్ ఆక్రమణకు రష్యన్ బలగాలు శ్రమిస్తున్నాయి.

రెండుగా చీలిన ఉక్రెయిన్

జపోరిజియా పవర్ ప్లాంటు స్వాధీనంతో రష్యా తన ఆక్రమణ పర్వంలో ఒక దశను విజయవంతంగా పూర్తి చేసినట్టైంది. భౌగోళికంగా ఉక్రెయిన్‌లో ఒక భాగాన్ని పూర్తిగా వశపర్చుకొన్నది. తూర్పు ఉక్రెయిన్‌లో నీపర్ నది చాలా కీలకమైనది. ఇది దేశాన్ని రెండుగా విభజిస్తున్నది. ఈ రెండు భాగాల మధ్య వారధిలా ఉన్నది జపోరిజియా పవర్ ప్లాంటు మాత్రమే. ఇప్పుడు దాన్ని స్వాధీనం చేసుకోవడం ద్వారా ఉక్రెయిన్ నుంచి తూర్పు భాగాన్ని పూర్తిగా వేరు చేసింది. ఉక్రెయిన్ నియంత్రణ నుంచి తప్పించింది.

ఉక్రెయిన్‌కు ప్రపంచం అండదండలు కావాలి : జెలెన్‌స్కీ సతీమణి ఓలెనా

కీవ్, మార్చి 5: ఉక్రెయిన్‌కు ప్రపంచం అండదండలు, సహకారం అవసరమని ఆ దేశాధ్యక్షుని సతీమణి ఓలెనా జెలెన్‌స్కా చెప్పారు. తమ దేశానికి అవసరమైనది రక్షణ పొందడం కాదన్నారు. తమ ప్రజలకు, సైన్యానికి ప్రపంచ మద్దతు అవసరమని తెలిపారు. ఫిబ్రవరి 24 నుంచి యుద్ధం ప్రారంభమైన నేపథ్యంలో ఆమె వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు ఓ టెలిగ్రామ్ చానల్‌ను ప్రారంభించారు.

ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ మాదిరిగానే ఆయన సతీమణి, దేశ ప్రథమ మహిళ ఓలెనా జెలెన్‌స్కా కూడా సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటారు. తమ దేశంపై రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత యథార్థాలను తెలియజేయడమే లక్ష్యంగా ఆమె ఓ టెలిగ్రామ్ చానల్‌ను ప్రారంభించారు. యుద్ధం సమయంలో ఎలా ఉండాలో ఆమె వివరిస్తున్నారు. తమకు చాలా ప్రశ్నలు ఉన్నాయని, తనకు చేతనైనంతగా సాయపడాలని అనుకుంటున్నానని చెప్పారు.

ఉక్రెయిన్‌కు ఏ విధంగా సాయపడాలో చెప్పాలని తనను ప్రపంచంలోని వివిధ దేశాల ప్రథమ మహిళలు అడుగుతున్నారని ఓలెనా చెప్పారు. ప్రపంచానికి సత్యం, నిజం చెప్పాలని తాను చెప్పానని తెలిపారు. ఉక్రెయిన్‌లో జరుగుతున్నది రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ చెప్తున్నట్లుగా స్పెషల్ మిలిటరీ ఆపరేషన్ కాదని, ఇది పూర్తి స్థాయిలో జరుగుతున్న యుద్ధమని తెలిపారు. దురాక్రమణదారు రష్యన్ ఫెడరేషన్ అని చెప్పారు. ఈ నిజాలు చెప్పడానికి గళమెత్తాలని పిలుపునిచ్చారు.

ఉక్రెయిన్‌కు అవసరమైనది రక్షింపబడటం కాదన్నారు. తమ సైన్యానికి, ప్రజలకు ప్రపంచం నుంచి అండదండలు అవసరమని చెప్పారు. ఆ మద్దతు కేవలం మాటల్లో ఉండకూడదని చెప్పారు.

విమర్శలు చేయడం సులభం.. పనులు చేయడమే కష్టం : మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, మార్చి 5 (నేటినిజం ప్రతినిధి) టీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులపై మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. విమర్శలు చేయడం సులభం.. పనులు చేయడమే కష్టమని కేటీఆర్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట్ మండలం వెంకటాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు.

రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు పోతోందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం పెరిగింది. రాజకీయం, ప్రజాజీవితంలో సంతోషం ఎక్కడ అనిపిస్తుందంటే.. ఇది పేదవాడి ప్రభుత్వమని సునీత చెప్పినప్పుడు సంతోషమేసింది. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించి ఇస్తున్నాం.

మీరు పరిపాలించే రాష్ట్రంలో ఇలాంటి ఇండ్లను నిర్మించారా? అని బీజేపీ, కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పెన్షన్లు, డబుల్ బెడ్రూం ఇండ్లు, కల్యాణలక్ష్మి పథకాలు అమలవుతున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాల అమలుపై చర్చకు మీరు ఏ ఊరికి రమ్మంటే ఆ ఊరికి వస్తానని స్పష్టం చేశారు. మాటలు చెప్పడం ఈజీ.. పనులు చేయడం కష్టం.. విమర్శ చేయడం అలక. విమర్శలు చేసే ముందు ఏం చేశారో చెప్పాలి. ప్రతి గ్రామంలో ఆశించినంత అభివృద్ధి జరుగుతోంది. సర్కార్ హాస్పిటల్లో రోగుల సంఖ్య పెరిగింది. వెంకటాపూర్ కూడా అభివృద్ధి బాటలో ముందుకెళ్తోంది. సిరిసిల్ల రూపుమార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

సమాజ పురోభివృద్ధికి మీడియా రంగం అవసరం ఎంతో ఉంది

జర్నలిస్టుల వేతన సవరణ చట్టం అమలు త్రైపాక్షిక కమిటీ సమావేశంలో కార్మిక శాఖ కమీషనర్ అహ్మద్ నదీమ్

నేటినిజం ప్రతినిధి

హైదరాబాద్, మార్చి 5: సమాజ పురోభివృద్ధికి మీడియా రంగం అవసరం ఎంతో ఉందని తెలంగాణ కార్మిక శాఖ కమీషనర్ అహ్మద్ నదీమ్ అన్నారు. చిక్కడపల్లిలోని కార్మికశాఖ కమీషనర్ కార్యాలయంలో శనివారం 'జర్నలిస్టుల వేతన సవరణ చట్టం అమలు త్రైపాక్షిక కమిటి' సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమీషనర్ మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమానికి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కమీషనర్ అహ్మద్ నదీమ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బైస దేవదాస్, (సంపాదకులు, నేటి నిజం దినపత్రిక), ఎ. గంగాధర్ (నమస్తే తెలంగాణ ఫోటో గ్రాఫర్), ఇ. చంద్రశేఖర్ (హైదరాబాద్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు), ఎం.ఎస్. హమ్మీ(సియాసత్), ఎస్. మధుసూధన్ (నమస్తే తెలంగాణ పత్రికా యాజమాన్య ప్రతినిధి), పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. కోవిడ్ నేపథ్యంలో రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితి దయనీయంగా తయారైయిందని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికశాఖ ద్వారా జర్నలిస్టుల హక్కులను చట్టపరంగా పరిరక్షించాలని కోరారు. పత్రికా పరిశ్రమలో వేతన సవరణకు జస్టిస్ గురుభక్ష్ మజీతియా సంఘం చేసిన సిఫారసులను అమలు అయ్యే విధంగా కార్మిక శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. కార్మిక శాఖ కమీషనర్ అహ్మద్ నదీమ్ మాట్లాడుతూ కార్మిక శాఖ తరఫున జర్నలిస్టుల సంక్షేమానికి.. మనుగడ.. సమస్యల పరిష్కారానికి చట్టపరంగా చర్యలు తీసుకు

కింగ్ ఆఫ్ స్పిన్ ఇక లేరు

(ప్రపంచ ప్రఖ్యాత ఆస్ట్రేలియన్ క్రికెటర్ షేన్ వార్న్ అకాల మరణానికి అక్షర నివాళి)

52 ఏళ్ల క్రికెట్ దిగ్గజం, బంతికే సకల నాట్య కలలు నేర్పిన స్పిన్ మాంత్రికుడు, లెగ్ స్పిన్ బౌలింగ్‌కే నిఘంటువైన ఆస్ట్రేలియన్ క్రికెటర్ షేన్ వార్న్ థాయిలాండ్, 'కో సముయ్'లోని విల్లాలో 04 మార్చి 2022న అనుమానస్పద గుండె పోటు(సస్పెక్టెడ్ హార్ట్ అటాక్)తో మరణించారనే వార్తతో ప్రపంచ క్రికెట్ మైదానాలన్ని మూగబోయి, క్రికెట్ క్రీడాకారులు/అభిమానులు నివ్వెరపోయి నమ్మలేక పోతున్నారు. 74-ఏండ్ల ఆస్ట్రేలియన్ మాజీ క్రికెటర్ రాడ్ మార్ష్ మరణానికి శ్రద్ధాంజలి ఘటించిన షేన్ వార్న్ మరి కొన్ని గంటల్లోనే కన్ను మూయడాన్ని అభిమానులు జీర్ణించుకోలేకుండా విచార మదనాలతో బాధను దిగమింగుకుంటూ నిచ్ఛేష్టులవుతున్నారు. ప్రపంచ క్రికెట్‌లోనే అత్యధిక వికెట్లు తీసిన రెండవ బౌలర్‌గా షేన్ వార్న్ 708 వికెట్లు తీసి స్పిన్ బౌలింగ్‌కే వన్నెతెచ్చిన పర్యాయపదంగా నిలిచారు. అత్యధికంగా 800 వికెట్లతో తొలి స్థానంలో శ్రీలంకన్ క్రికెటర్ ముత్తయ్య మురళీధరణ్ ఉన్నారని మనకు తెలుసు. 1994లో 'విజ్డెన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్', 2000లో 'శతాబ్దపు విజ్డెన్ క్రికెటర్ (విజ్డన్ క్రికెటర్స్ ఆఫ్ ది సెంచరీ)', 2013లో 'ఐసిసి క్రికెట్ హాల్ ఆఫ్ ఫేమ్'గా పురస్కారం పొందిన ఐదుగురిలో ఒక్కడిగా, 1997, 2004ల్లో 'ప్రపంచ విజ్డెన్ లీడింగ్ క్రికెటర్'గా పలు ప్రతిష్ఠాత్మక గుర్తింపులు పొందిన షేన్ వార్న్ కౌమార దశ వరకు ఫూట్‌బాల్ క్రీడలో కూడా నైపుణ్యం సాధించారు. టెస్టులు(708), వన్ డే(293) మ్యాచ్‌ల్లో కలిపి 1001 వికెట్లు తీసిన వార్న్ ప్రతిభను ప్రపంచ క్రికెట్ మదిలో పదిలంగా దాచుకుంటుంది. అంతర్జాతీయ క్రికెట్‌కు స్వస్తి పలికిన వార్న్ 2008 - 13ల మధ్య రాజస్థాన్ రాయల్స్ జట్టు కెప్టెన్‌గా తొలి సీజన్ ఐపియల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) ఆడి గెలిపించారు. 1990-91, 2006-07లలో విక్టోరియా జట్టులో, 2000-07 మధ్య హాప్‌షేర్ జట్టులో, 2008-11 మధ్య రాజస్థాన్ రాయల్స్ జట్టులో, 2011-12, 2012-13లలో మెల్బార్న్ స్టార్స్ జట్టులో సభ్యుడిగా తన ప్రతిభను చాటారు. షేన్ వార్న్ క్రికెట్ మైదానంలో బౌలర్‌గా తన రాకతో అప్పటి వరకు ఫాస్ట్ బౌలర్లు పొందిన ఆధిపత్యానికి గండి పడుతూ స్పిన్ బౌలర్లకు ప్రాధాన్యం పెరగడం ప్రారంభమైంది.

ఆస్ట్రేలియన్ క్రికెటర్‌గా మైదానంలో?:

13 సెప్టెంబర్ 1969న ఆస్ట్రేలియాలోని విక్టోరియా 'అప్పర్ ఫెన్‌ట్రీ గుల్లీ'లో బ్రిగిట్, కేత్ వార్న్ దంపతులకు జన్మించిన 'షేన్ కీత్ వార్న్' విద్యాభ్యాసం హామ్టన్ హైస్కూల్, మెంటన్ గ్రామర్‌లో జరిగి 12వ తరగతి వరకు పూర్తి చేశారు. 1983 - 84లో యూనివర్సిటీ ఆఫ్ మెల్బర్న్ క్రికెట్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ అండర్-16 'డవ్లింగ్ షీల్డ్ కాంపిటీషన్లో' లెగ్-స్పిన్, ఆఫ్-స్పిన్ బౌలర్‌గా, లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌గా రాణించారు. సెయింట్ కిల్డా క్రికెట్ క్లబ్, అక్రింగ్టన్ క్రికెట్ క్లబ్‌లకు ప్రాతినిధ్యం వహించిన షేన్ వార్న్ 1990లో ఆస్ట్రేలియన్ క్రికెట్ క్లబ్ సహకారంతో అడలైడ్‌లో శిక్షణ పొందారు. 15 ఫిబ్రవరి 1991న ఫస్ట్ క్లాస్ క్రికెట్లో విక్టోరియా టీమ్ సభ్యుడిగా అడుగిడిన షేన్ వార్న్ ప్రతిభను గుర్తించి ఆస్ట్రేలియా-బి జట్టుకు ఎంపికై జింబాబ్వేతో తొలి అంతర్జాతీయ క్రికెట్ టూర్ చేశారు. ఆస్ట్రేలియా-ఏ జట్టు సభ్యుడిగా వెస్టిండీస్ పర్యటించారు. ఏడు ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల అనంతరం 02 జనవరి 1992న సిడ్నీలో జరిగిన ఇండియా, ఆస్ట్రేలియా టెస్ట్ మ్యాచ్‌లో స్పిన్నర్‌గా క్రికెట్ జైత్రయాత్ర ప్రారంభించారు. ఆరడుగుల అద్భుత క్రికెటర్‌గా షేన్ వార్న్ 02 జనవరి 1992 నుంచి 02 జనవరి 2007 వరకు 145 టెస్ట్ మ్యాచ్‌ల్లో ఆడి 25.41 సగటు పరుగులచ్చి 708 వికెట్లు పడగొట్టడమే కాకుండా లోయర్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌గా 17.32 సగటు పరపగులతో మె?త్తం 3,154 పరుగులు చేశారు. టెస్ట్ క్రికెట్లో 10 మ్యాచ్‌లలో 10కి పైగా వికెట్లు, 37 మ్యాచ్‌ల్లో 5కు పైగా వికెట్లు తీసుకొని తన సత్తా చాటుకున్నారు. తన క్రికెట్ చరిత్రలో 194 వన్ డే మ్యాచ్‌లు ఆడిన షేన్ వార్న్ 293 వికెట్లు (25.73 సగటు పరుగులిచ్చి) పడగొట్టి, బ్యాటింగ్‌లో 1,081 పరుగులు (13.05 సగటుతో) చేశారు. టెస్ట్ మ్యాచ్ బౌలర్‌గా 8/71 అత్యుత్తమ ప్రతిభగల బౌలింగ్, వన్ డే మ్యాచ్‌లో 5/33 బెస్ట్ బౌలింగ్ ఫిగర్స్ చేశారు. టెస్టుల్లో 125, వన్ డేల్లో 264 క్యాచ్‌లు పట్టారు. 1999-2000లో ఆస్ట్రేలియా జట్టుకు వైస్ కెప్టెన్‌గా సేవలు అందిస్తూ 11 మ్యాచ్‌ల్లో 10 మ్యాచ్‌ల్లో గెలుపు 01 ఓటమిని అందించారు. టెస్టుల్లో 12 సార్లు అర్ధశతకాలు, వన్ డేల్లో ఒక సారి అర్ధ శతకం చేసి బ్యాట్స్‌మెన్‌గా కూడా తన సత్తా నిరూపించుకున్నారు. క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన షేన్ వార్న్ క్రికెట్ కామెంటేటర్‌గా స్కైలైట్ స్పోర్ట్స్, ఫాక్స్ క్రికెట్, నైన్ నెట్‌వర్క్‌లలో పని చేశారు. 1993 ఆషెస్ సీరీస్‌లో మైక్ గాటింగ్‌కు అత్యద్భుతమైన 'బాల్ ఆఫ్ ది సెంచరీ' బంతిని వేసి ఔట్ చేసి తన ప్రత్యేకతను ప్రపంచ క్రికెట్‌కు పరిచయం చేశారు.

వార్న్‌ను చుట్టుముట్టిన వివాదాలు:

ఫిబ్రవరి 2003లో నిషేదిత డయురెటిక్ మాదకద్రవ్యాలు వాడారని రుజువు కావడంతో ఆస్ట్రేలియన్ క్రికెట్ బోర్డ్ చేత ఒక ఏడాది క్రికెట్ క్రీడ నుంచి నిషేధ శిక్షను అనుభవించారు. నిషేధ సమయంలో నైన్ నెట్‌వర్క్ టీవీ వ్యాఖ్యాతగా అభ్యంతరకర అభిప్రాయాలు వ్యక్తం చేయడంతో వ్యాఖ్యాతగా కూడా రెన్యువల్ పొందలేక పోయారు. 1995లో 'సైమన్ కాలహాన్'ను వివాహం చేసుకొని ముగ్గులు పిల్లలకు తండ్రి అయిన వార్న్ 2005లో భార్యకు విడాకులు ఇచ్చారు. 2000లో బ్రిటీష్ నర్సుకు అభ్యంతరకర మెసేజ్ పంపించారనే అపవాదుమోస్తూ వైస్ కెప్టెన్ బాధ్యతలను కోల్పోయారు. సిగరెట్ తాగుతున్న వార్న్ ఫోటోలను తీశారనే కోపంతో కొందరు యువకులతో వాగ్వాదంలో చిక్కుకున్నారు. భార్య నుండి విడాకుల తరువాత బ్రిటీష్ నటి ఎలిజబెత్ హార్లీతో సహజీవనం చేస్తూ పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడ్డారు. మెల్బోర్న్ వ్యాపార మహిళకు అసభ్య మెసేజ్ పంపించి విమర్శలు ఎదుర్కొన్న షేన్ వార్న్ తన ప్రియురాలు హార్లీతో వివాహ ఆలోచన నుంచి విరమించుకున్నారు. ప్రముఖ డిజె మోడెల్ 'ఎమిలీ స్కాట్'తో కూడా డేటింగ్ చేశారనే అపవాదును కూడా మోశారు. 'కిమ్ గ్రాత్' అనే సింగిల్ మదర్ మహిళతోనే కాకుండా కాత్రీన్ లాంగ్, సైమన్ టూమ్, ఎమిలీ సియర్స్ లాంటి పలువురు మహిళలతో పరిచయం పెంచుకున్నారని వార్తలు తరుచుగా గుప్పుమన్నాయి.

హెటరోక్రోమియా లోపంతో ఒక కన్ను ఆకుపచ్చగా, మరో కన్ను నీలం రంగును కలిగిన షేన్ వార్న్ రిటైర్‌మెంట్ తరువాత 'షేన్ వార్న్ ఫౌండేషన్' అనే స్వచ్ఛంధ సంస్థను స్థాపించి అభాగ్య అనారోగ్య బాలలకు అవసర సేవలు అందించారు. తన స్వీయ చరిత్రను 'నో స్పిన్' పేరుతో వ్రాసారు. ప్రపంచ క్రికెట్ చరిత్రలో అద్వితీయ క్రీడాకారులైన సర్ డొనాల్డ్ బ్రాడ్‌మెన్, సర్ గ్యారీ సోబర్స్, సర్ జాక్ హబ్స్, సర్ వివియన్ రిచర్డ్‌ల సరసన ఐదవ వాడిగా నిలిచిన షేన్ వార్న్ 'విజ్డెన్ క్రికెటర్స్ ఆఫ్ ది సెంచరీ'గా అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించారు. 'కింగ్ ఆఫ్ స్పిన్'గా కీర్తించబడిన షేన్ వార్న్ ఆట తీరు అనన్య సామాన్యం, అద్వితీయం, అనుసరణీయం, సదా స్మరణీయం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

నిధుల కేటాయింపులో తగ్గేదేలే - అభివృద్ధి నిధుల్లో వివక్షత వద్దు..!

--అన్ని వార్డులకు సమానంగా నిధులు ఇవ్వాలి.
-- సదాశివపేటకు 25 కోట్లు అభి వృద్ధి నిధులు కేటాయించినముఖ్యమంత్రి కి ధన్యవాదాలు.
--5400 మంది ప్రజలకు ప్లాటు కలిపిస్తా.
--పట్టణంలో రోడ్డులు మురికి నీటి కాల్వలు అబివృద్ధి చేయాలి.
--మున్సిపాలిల్ రివ్యూ మీటింగ్ లో సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి.

సంగారెడ్డి మార్చి 5 (నేటి నిజం ప్రతినిధి)మున్సిపల్ పట్టణలల్లో ప్రజల మౌలిక సదుపాయాల కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి 25 కోట్లు అబివృద్ధి నిధులు మంజూరు చేయడం మంచి పరిణామనీ అని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం సదాశివపేట మున్సిపాలిటీ కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులతో అబివృద్ధి పై సమీక్ష నిర్వహించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అబివృద్ధి నిధులు 25 కోట్లు కేటాయించిననందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.2013 పేట పట్టణ ప్రజలకు మంచి నీటి ఇబ్బందులు తొలగించాలని ఏటీగడ్డ సంఘం నుంచి పైప్ లైన్ వేసిన ఆశించిన ప్రయోజనం ప్రజలకు కలుగాలేదని తెలిపారు. ఆ తరువాత ఎమ్మెల్యే గా నేను ఓడిపోవడం జరిగిందని అన్నారు. మళ్ళీ గెలిచిన తరువాత ప్రజల మధ్య కరోనా రావడం తో కొత్త గ్యాప్ వచ్చిందని అన్నారు. ఇక పైన ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సమస్యల పరిష్కరాం కోసం నా కృషి ఉట్టుందని తెలిపారు. ఈటివల ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పనుల గూర్చి అధికారులతో పూర్తి వివరాలు సేకరించారు. మంచి నీటి స్టోరేజ్ ట్యానీకు నిర్మాణము. కొత్త కాలనిలకు పైప్ లైన్ల ఏర్పటు పై సమీక్షించారు.ఐదు ఆరు నెలల్లో పూర్తిగా వినియోగంలోకి తెస్తామని అధికారులు సూచించారు. ప్రభుత్వం కేటాయించిన 25 కోట్ల అబివృది నిధుల్లో ఎలానీటి వివక్ష లేకుండా చూడాలని, కాంగ్రెస్ పార్టీ కి 6 మంది కౌన్సిలర్లు కు అందరి తో పాటు సమానంగా నిధులు కల్పించాలని సూచించారు. ప్రభుత్వం తరపున మున్సిపల్ కమిషనర్ కు ఇబ్బందులు ఏర్పడిన నిధులు అందరికి సమన ప్రతిపదికన ఉంచాలని అన్నారు. ఏ వార్డుకు సరైన నిధులు కేటాయించాక పోయిన ఊరుకునేది లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో నిధులు తెచ్చిన అందరికి సమాన నిధులు కేటాయించే వరామని తెలిపారు. కొన్ని కారణనాల వల్ల సిద్దాపూర్ నందు పేదలకు 5400 ప్లాట్లు కల్పించిన అవి ఆపేశారని. వాటిని పేదలకు కల్పించే వరకు కృషి చేస్తానని అన్నారు. అసెంబ్లీ లో మాట్లాడుతా ,మరిన్ని నిధులు తెచ్చి పేటను అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రతి వారం రివ్యూ మీటింగ్ పెట్టి ప్రజ సమస్యలు పరిష్కరిస్థమని తెలిపారు. గాంధీ చౌక్ నుంచి దుర్గమ్మ గుడి వరకు వెంకటాపూర్ దేవాలయం వరకు రొడ్డు అభివృద్ధి నిధులు వెచ్చించాలని అధికారులకు సూచించారు. సిద్దాపూర్ రొడ్డు కు శాశ్వత పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. హిందు ముస్లిం క్రైస్తవులు అనే తేడాలు లేకుండా వల్ల పండుగలలో లైటింగ్ ఏర్పటు చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులకు అధికారులకు అందరు సామానులే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష రెడ్డి, అధికారులు సదాశివపేట్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు పార్టీ నాయకులు సతాని శ్రీశైలం,అరుణ్ కుమార్, కంది కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అద్వాన్నంగా మారిన భవానీ మందిర్ -తాళ్లపల్లి రోడ్డు

-- గుంతల రోడ్డుతో వాహనదారుల,పాదచారుల ఇబ్బందులు.
--కేసీఆర్ మంజూరు చేసిన నిధులతో రోడ్డు వేయాలని విజ్ఞప్తి.

సంగారెడ్డి మర్చి 5 (నేటి నిజం ప్రతినిధి) జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని భవానీ మందిర్ నుంచి నలందా నగర్ వరకు(తాళ్లపల్లి రోడ్డు) ప్రస్తుతం ఉన్న రోడ్డు అద్వాన్నంగా మారింది. దారి పొడవునా అడుగడుగునా గుంతలే కనిపిస్తున్నాయి. గుంతల రోడ్డుతో కొన్ని నెలలుగా వాహనదారులు,పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోనే మూడు వార్డులు, ఒక తాళ్లపల్లి గ్రామం వెళ్లే మార్గం ఇలా ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో అధికారుల తీరుపై స్థానిక ప్రజలు పెద్దవి విరుస్తున్నారు. మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. ఇటీవల సీఎం కేసీఆర్ సంగారెడ్డి మున్సిపాలిటీకి రూ.50 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ నిధులతో రోడ్డు వేసి ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏప్రిల్‌లో విశాలాక్షి సాహిత్య సభ

విశాలాక్షి సాహిత్య మాసపత్రిక &
మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ కథల పోటీ,
డా॥ ఈదూరు సుధాకర్ స్మారక కవితల పోటీ
శ్రీమతి పుప్పాల సూర్యకుమారి మినీ కథల పోటీ
విజేతలకు ఏప్రిల్ నెలలో నెల్లూరులో జరిగే
సాహిత్య సభలో బహుమతి ప్రధానం
జరుగును. దీనితోపాటు విశాలాక్షి సాహిత్య పురస్కారాలు కూడా
ప్రముఖులు అందుకోనున్నారు. తేదీ వివరాలు త్వరలో తెలియపరచగలం

75 సంవత్సరాల ప్రగతిశీల భారతదేశం మరియు విజయాలను స్మరించుకోవడానికి భారత ప్రభుత్వం యొక్క చొరవే ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

న్యూఢిల్లీ, మార్చి 4:భారతదేశం 75 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటోంది. 75 సంవత్సరాల ప్రగతిశీల భారతదేశం మరియు దాని ప్రజల అద్భుతమైన చరిత్ర, సంస్కృతి మరియు విజయాలను పురస్కరించుకుని, స్మరించుకోవడానికి భారత ప్రభుత్వం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ని ప్రారంభించింది అని బ్యూరో ఆఫ్ ఔట్రీచ్ అండ్ కమ్యూనికేషన్, న్యూఢిల్లీ, ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ శ్రీ సత్యేంద్ర ప్రకాష్ అన్నారు.

భారతదేశం పరిణామం చెందే క్రమంలో ఇంత దూరం ప్రయాణించడంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా, స్ఫూర్తితో కూడిన భారతదేశం 2.0ని సక్రియం చేయాలనే ప్రధాని మోదీ దార్శనికతను ఎనేబుల్ చేసే శక్తి మరియు సామర్థ్యాలను కలిగి ఉన్న భారత ప్రజలకు ఈ ఆత్మనిర్భర్ భారత్ మహోత్సవ్ అంకితం అని ఆయన అన్నారు.

శ్రీ సత్యేంద్ర ప్రకాష్, మరియు సమాచార డ ప్రసార మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, శ్రీ విక్రమ్ సహాయ్ సంయుక్తంగా కోవిడ్ అవగాహన మరియు టీకాలతో సహా ప్రభుత్వం యొక్క వివిధ ప్రధాన కార్యక్రమాల సందేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఒఇఆ- ఎనేబుల్డ్ డిజిటల్ డిస్‌ప్లే వాహనాలను ప్రారంభించారు.

ఆంధ్రప్రదేశ్, విజయవాడ ప్రాంతీయ ఔట్రీచ్ బ్యూరోచే ఆజాదీ కా అమృత్ మహోత్సవ వేడుకల్లో భాగంగా 2022 మార్చి 2వ తేదీన విజయవాడలో ప్రారంభించబడిన డిజిటల్ డిస్‌ప్లే ప్రచారానికి సంబంధించిన మొబైల్ వ్యాన్‌లు ప్రస్తుతం తూర్పుగోదావరిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక అవగాహన ప్రచారాలను చేపడుతున్నాయి. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలపై పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లాల్లో 10 రోజులు ఈ వాహనాలు సంచరిస్తూ అవగాహన కల్పించనున్నాయి.

తెలంగాణ ఈ-హెల్త్ ప్రొఫైల్ ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి హరీశ్ రావు

ములుగు, మార్చి 5:: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మరో పథకం 'తెలంగాణ హెల్త్ ప్రొఫైల్'ను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం రాష్ట్రంలోని 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరి ఆరోగ్య సమగ్ర సమాచార నివేదిక (హెల్త్ ప్రొఫైల్) సిద్ధం చేయాలని నిర్ణయించింది. దీనికోసం పైలట్ ప్రాజెక్టులుగా ములుగు, రాజన్న సిరిసిల్ల జిల్లాను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో భాగంగా ములుగు జిల్లా కలెక్టరేట్‌లో హెల్త్ ప్రొఫైల్ పెలెట్ ప్రాజెక్టును మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్‌తో కలిసి హరీశ్ రావు ప్రారంభించారు. అంతకుముందు జిల్లా దవాఖాన భవనం, రేడియాలజీ ల్యాబ్, పీడియాట్రిక్ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

హెల్త్ ప్రొఫైల్‌తో ఎన్నో ప్రయోజనాలు..

హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయడంలో భాగంగా వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి, ప్రతి వ్యక్తి ఆరోగ్య సమాచారాన్ని సేకరించనున్నారు. ప్రతి వ్యక్తికి ప్రత్యేకంగా ఒక ఐడీ నంబర్ ఇస్తారు. వారి నుంచి నమూనాలను సేకరించి, 30 రకాల డయాగ్నోస్టిక్ పరీక్షలు నిర్వహిస్తారు. ఫలితాల ఆధారంగా వారి ఆరోగ్య సమస్యలను నిర్ధారిస్తారు. ఒకవేళ ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే చికిత్స ప్రారంభిస్తారు. వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తారు.

ఈ సమాచారంతో అనేక ప్రయోజనాలు కలుగనున్నాయి. దీర్ఘకాలిక బాధితులను గుర్తించడం, వారికి మెరుగైన వైద్యం అదించడం, క్యాన్సర్ వంటి రోగాలను ప్రాథమిక దశలోనే గుర్తించడం, రక్తహీనత వంటి సమస్యలను గుర్తించి తగిన చికిత్స అందించడం.. ఇలా అనేక ప్రయోజనాలు కలుగనున్నాయి.

సర్వేలో భాగంగా ఇంటి వద్ద చేసే పరీక్షలు

హెల్త్ ప్రొఫైల్ సర్వేలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి 18 ఏండ్లు పైబడిన ప్రతి వ్యక్తి ఆరోగ్య సూచికలను సేకరిస్తారు. ములుగు జిల్లాలో దాదాపు 2 లక్షల 18 వేల 852 మంది 18 ఏండ్లు పైబడిన వారు ఉన్నారు. వారి నుంచి..

-జ్వరం, రక్త పోటు, రక్తహీనత, రక్తంలో చక్కెర స్థాయి, వయసు తగ్గ ఎత్తు, బరువు, బ్లడ్ గ్రూపు, శరీర కొలతలు, రక్తంలో ప్రాణవాయువు, గుండె కొట్టుకునే తీరు, ఇతర అంశాలు, అనారోగ్య సమస్యలు నమోదుచేసుకుంటారు.

-రక్తం, మూత్ర నమూనాలను సేకరించి సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఖఉఅ)లో పరిశీలిస్తారు.

-ప్రతి వ్యక్తి ఆధార్ నంబర్, ఇంటి అడ్రస్ వంటి వివరాలు సేకరించిన వారికి ఏకీకృత నంబర్‌ను కేటాయిస్తారు. దీంతో వ్యక్తి ఆరోగ్య వివరాలు తెలుసుకునే వీలుంటుంది.

-ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

-కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ), సంపూర్ణ మూత్ర పరీక్ష, మూత్రపిండాల పనితీరు తెలుసుకునేందుకు ఆల్బుమిన్, బ్లడ్ యూరియా, క్రియాటిన్ మొదలైన పరీక్షలు చేస్తారు

-రక్తంలో చక్కర స్థాయి తెలుసుకొనేందుకు మూడు నెలల సగటు (హెచ్‌డీఏ 1సీ) పరీక్షలు

-గుండె పనితీరును తెలుసుకునేందుకు కొలెస్ట్రాల్, కంప్లీట్ హెచ్డీఎల్, ట్రైగ్లిజరైడ్స్, ఈసీజీ

- కాలేయ సంబంధిత పనితీరును తెలుసుకునేందుకు వివిధ కాలేయ పరీక్షలు చేస్తారుఈ పథకంలో భాగంగా వైద్య పరీక్షల ఆధారంగా అనారోగ్య సమస్యలు ఉన్న వారికి వెంటనే చికిత్స అందిస్తారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి భవిష్యత్తులో ఏ విధమైన జబ్బులు రాకుండా తగిన సూచనలు చేస్తారు.

యాదాద్రిలో వైభవంగా ధ్వజారోహణం

యాదాద్రి, మార్చి 5:: యాదాద్రి ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు రెండవ రోజు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులోభాగంగా ధ్వజారోహణ పూజలు నయనమనోహరంగా రాగతాళ ధ్వనులతో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఆస్థానం నుంచి స్వామివారిని, ధ్వజ పటాన్ని ఊరేగిస్తూ ధ్వజస్థంభం వద్దకు తీసుకువచ్చి, ధ్వజారోహణం చేశారు. దేవతామూర్తులను ఆహ్వానిస్తూ ధ్వజపటంపై గరుడవంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించి గరుడ ముద్దలు ఎగురవేశారు. గరుడ ముద్దలు అందుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. రాత్రి భేరిపూజ, దేవతాహ్వానం నిర్వహించనున్నారు. స్వామి వారి కల్యాణం వీక్షించమని 33 కోట్ల దేవతలను ఆహ్వానం పలుకనున్నారు. ఈ పూజల్లో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఆలయ ఈవో గీత, చైర్మన్ నరసింహమూర్తితో పాటు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

విజయవంతంగా అత్యాధునిక బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష - వెల్లడించిన భారత నౌకాదళం

న్యూఢిల్లీ, మార్చి 4:భారత నౌకాదళం అధునాతన వెర్షన్ బ్రహ్మోస్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించింది. ఈ పరీక్ష సమయంలో, క్షిపణి ఖచ్చితమైన లక్ష్యాన్ని చేధించింది. ఇది బ్రహ్మోస్ క్షిపణికి ఆధునిక వెర్షన్ అని చెప్పాలి. అందులో పలు అప్‌డేట్‌లు వచ్చాయి. నవీకరణ తర్వాత, దాని ఫైర్‌పవర్ మరింత పెరిగింది. భారతదేశం యొక్క ఈ విజయవంతమైన పరీక్ష స్వావలంబన భారత మిషన్ విజయానికి ఒక మైలురాయిగా పరిగణించబడుతుంది. సముద్రం నుంచి దూరంగా భూమిపై ఉన్న లక్ష్యాలపై దాడి చేసే సామర్థ్యాన్ని ఈ పరీక్షల ద్వారా తెలుసుకున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. బ్రహ్మోస్ క్షిపణితోపాటు దీనిని పరీక్షించిన ఐఎన్ఎస్ చెన్నై యుద్ధ నౌక, రెండూ కూడా దేశీయంగా నిర్మించినవేనని భారత నౌకాదళం తెలిపింది. భారతీయ క్షిపణి అభివృద్ధి, నౌకా నిర్మాణ సామర్థ్యానికి ఇవి ప్రతీకలనిపేర్కొంది. ఆత్మ నిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా ప్రయత్నాలు, సహకారాలను ఇలాంటివి మరింత బలోపేతం చేస్తాయని వెల్లడించింది.

శివరాజ్ సింగ్ చౌహాన్ బర్త్ డే - స్వీపర్ల కాళ్లు కడిగి సన్మానించిన సీఎం

ముంబాయి, మార్చి 5: నేడు మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ పుట్టినరోజు. కాగా ఆయన తన బర్త్ డే వేడుకలను పారిశుధ్య కార్మికులతో కలిసి జరుపుకోవడం విశేషం. ఈ సందర్భంగా ఇద్దరు స్వీపర్లకు కాళ్లు కడిగి సీఎం సన్మానించారు. వారికి స్టార్ రేటింగ్ ప్రకారం వార్షిక భత్యం, నెలకు రూ.150 రిస్క్ అలవెన్స్ కూడా ప్రకటించారు. సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ భోపాల్‌లోని మోతీలాల్ నెహ్రూ సైన్స్ కాలేజీ ప్లేగ్రౌండ్‌లో క్లీనింగ్ స్నేహితులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణగౌడ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. పారిశుధ్య కార్మికుల సేవాభావం అభినందనీయమని సీఎం అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 7 స్టార్ రేటింగ్ పొందిన నగరాల్లో పారిశుద్ధ్య కార్మికులకు రూ.7 వేల సమ్మాన్ నిధిని అందజేస్తామని ఆయన ప్రకటించారు. అదేవిధంగా, 5-స్టార్ రేటింగ్ ఉన్న నగరాల్లో, పారిశుధ్య కార్మికులకు 5000 రూపాయల సమ్మాన్ నిధి ఇవ్వబడుతుంది. క్లీనింగ్‌లో 5 స్టార్ లేదా 7 స్టార్ నగరాన్ని పొందడానికి ప్రయత్నించండి అని కూడా అతను చెప్పాడు. పౌరులు కూడా వారికి సహాయం చేయాలి. చెత్త వర్గీకరణపై కూడా దృష్టి సారించామని సీఎం శివరాజ్ తెలిపారు. పొడి ? తడి చెత్తను వేర్వేరుగా నిర్వహించాలన్నారు.

దేశంలో భారీగా పెరుగనున్న పెట్రోల్, డీజిల్ ధరలు.. ఎంతంటే..!

న్యూఢిల్లీ, మార్చి 5:ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కీవ్, ఖార్కీవ్ నగరాలపై రష్యా బలగాలు బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో ఆ రెండు నగరాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. భారీగా ప్రాణ నష్టం జరిగింది. ఇంకా ఉక్రెయిన్ భూభాగాలపై రష్యా సేనలు దాడులు చేస్తూనే ఉన్నాయి. ఉక్రెయిన్ సేనలు సైతం రష్యా దాడిని ధీటుగానే ఎదుర్కొంటున్నాయి. అయితే, ఈ రెండు దేశాల గొడవ

వైభవంగా పెన్నఓబులేసుని పల్లకి సేవ

అమరావతి, మార్చి 5: అనంతపురం జిల్లా లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెన్నహోబిలం లోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో

శనివారం స్వామి వారి పల్లకి సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవలో భాగంగా తెల్లవారుజామున స్వామి వారి మూలవిరాట్ కు అభిషేకం, వివిధ రకాల పుష్పాలతో, ఆభరణాలతో అలంకరణ, అర్చనలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి కార్యక్రమాలను నిర్వహించారు. భూదేవి శ్రీదేవి సమేతుడైన లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలతో, పుష్పాలతో అలంకరించారు. ప్రత్యేకంగా తయారు చేసిన పల్లకిలో, స్వామి వారి ఉత్సవ మూర్తులను కొలువు దీర్చారు. భాజ భజంత్రీల నడుమ స్వామి వారిని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. స్వామి వారి పల్లకి సేవను తిలకించడానికి ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదాన సత్రంలో ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ ఓ విజయ్ కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అశోక్ కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు చిన్న ముష్టూరు బాబు, నీలప్ప తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో ఘనంగా 'మహిళా బంధు కేసీఆర్' సంబురాలు : మంత్రి

వరంగల్, మార్చి 5:: మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు పాలకుర్తి నియోజకవర్గంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 6, 7, 8 తేదీల్లో 'మహిళా బంధు కేసీఆర్' పేరిట పాలకుర్తి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహిస్తామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో అద్భుతమైన సంక్షేమ, సంరక్షణ పథకాల అమలు నేపథ్యంలో మహిళా దినోత్సవం సంబురాలు ఘనంగా చేపట్టాలని, పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులకు మంత్రి సూచించారు.

సీఎం కేసీఆర్ ప్రభుత్వం మహిళ కోసం తీసుకువచ్చిన పథకాలు మైలురాయిని చేరుకున్న నేపథ్యంలో ఈ సారి మహిళా దినోత్సవంతో.. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అనుసంధానించి వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. మిషన్ భగీరథతో ఆడబిడ్డల కష్టాలను దూరం చేశారని, మాతా శిశు సంరక్షణ కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు పింఛన్లు అందజేస్తున్నారన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, మహిళా రక్షణకు షీ టీమ్స్, భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిందని, బాలికా.. మహిళా విద్య కోసం ప్రత్యేక స్కూల్స్.. కాలేజీలు ఏర్పాటు చేశారన్నారు. పిల్లలకు 70లక్షల హెల్త్ హైజెనిక్ కిట్లను అందించారని, ఆయా పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలి : టెస్కాబ్ వైస్ చైర్మన్

యాదాద్రి, మార్చి 5: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మాణిక్యాలను వెలుగులోనికి తీసుకురావాలని, క్రీడలతో పాటు క్రీడాకారులను అందరూ ప్రోత్సహించాలని టెస్కాబ్ రాష్ట్ర వైస్ చైర్మన్, డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. ఈరోజు యాదాద్రి జిల్లాలోని తుర్కపల్లి మండల కేంద్రంలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ?. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేలా కృషి చేయాలన్నారు. క్రీడలతో యువకుల్లో ఆరోగ్యం దృఢంగా మారుతుందని, కరోనా లాంటి మహమ్మారి రోగాలను కూడా ఎదుర్కోవాలంటే శరీరంలో వ్యాధినిరోధక శక్తి ఉండాలన్నారు. ఆ శక్తి క్రీడలతో వస్తుందన్నారు. క్రీడలను మండల, జిల్లా స్థాయిలో ప్రోత్సహించి ఆదరణ కల్పించడానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానన్నారు ప్రాథమిక పాఠశాల నుంచి క్రీడలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బిక్కు నాయక్, ఎంపీపీ భూక్యా సుశీల రవీందర్ నాయక్, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డి నరేందర్ రెడ్డి, యాదగిరిగుట్ట మండల పార్టీ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఆర్ఎస్ఎస్ చైర్మన్ నర్సింలు, మాజీ ఎంపిపి రవీంద్రనాథ్ గౌడ్, వైస్ ఎంపీపీ మహాదేవుని శ్రీనివాస్, ఎంపీటీసీలు పలుగుల నవీన్ కుమార్, గిద్దె కర్ణాకర్, టవర్నమెంట్ నిర్వాహకుడు మాజీ ఎంపిటిసి తలారి శ్రీనివాస్, టిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ ప్రమాదంలో పడింది: భట్టి

హైదరాబాద్, మార్చి 5:తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ ప్రమాదంలో పడిందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ధరణి పోర్టల్‌తో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధరణి పోర్టల్ లోపాలే జంట హత్యలకు మూలకారణమని ఆరోపించారు. బడ్జెట్‌లో దళితులు, గిరిజనుల కోసం చట్టప్రకారం నిధులు కేటాయించాలని భట్టి డిమాండ్ చేశారు. పేదల ఇళ్ల నిర్మాణానికి పెద్దఎత్తున నిధులు కేటాయించాలన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఒకమాట, ఢిల్లీలో మరోమాట మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణలో శాంతిభద్రతలు అదుపుతప్పాయని విమర్శించారు. మంత్రిపైనే హత్యకు కుట్ర జరిగిందంటే.. సామాన్యుల పరిస్థితేంటి? అని ప్రశ్నించారు. సీడ్ కంపెనీలతో లాలూచీ వల్లే నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోవట్లేదని భట్టి విక్రమార్క మండిపడ్డారు.

ఫోన్ అతిగా వాడొద్దన్నందుకు.. విద్యార్థిని ఆత్మహత్య

తిరుపతి,మార్చి 5: ఫోన్ అతిగా వాడొద్దు.. చదువుపై దృష్టిపెట్టాలని మందలించినందుకే ఓ విద్యార్థిని సూసైడ్ చేసుకున్న ఘటన ఇవ్వాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా తిరుపతి నగరంలోని కొర్లగుంట మారుతినగర్ లో ఉంటున్న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకుంది. తిరుమలలో వ్యాపారి అయిన బాలాజీ కుమార్తె వాణిశ్రీ (16) ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతోంది. అయితే చదువు మీద శ్రద్ధ చూపకుండా ఎక్కువగా ఫోన్ వాడుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆమె మనస్తాపానికి గురై ఇంటి రెండో అంతస్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. బాలిక తండ్రి బాలాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈస్ట్ ఎస్ఐ జయ స్వాములు తెలిపారు.

కాలేజీల్లో మిడ్ డే మీల్స్.. ఎప్పుడు?

హైదరాబాద్, మార్చి 5: ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ, బీఈడీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ అటకెక్కినట్లుగా తెలుస్తోంది. దాదాపు గత మూడేళ్ల నుంచి ఈ పథకం అమలు కోసం విద్యార్థులకు ఎదురుచూపులే మిగులుతున్నాయి.

ప్రభుత్వం ఇచ్చిన హామిని అమలు చేయాలని విద్యార్థి, అధ్యాపక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచైనా మధ్యాహ్న భోజన పథకం అన్ని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, బీఈడీ, డీఈడీ, పాలిటెక్నిక్‌తో పాటు ఉన్నత విద్యాసంస్థల్లో అమలు చేయాలని కోరుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్నం భోజనం కార్యక్రమం అమలుకోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఇది అందుబాటులోకి వస్తే విద్యార్థుల సంఖ్య పెరగడమే కాకుండా పరీక్షల్లో మంచి ఫలితాలను రాబట్టొచ్చని అధ్యాపకులు చెప్తున్నారు.

కళాశాలల్లో మధ్యాహ్నం భోజనం పెడితే భోజనానికి ఇంటికి వెళ్లకుండా అక్కడే చదువుకొవడంతోపాటు విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గించవచ్చనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించాలనుకుంది. ఇందులో భాగంగానే 2018-19 విద్యాసంవత్సరం నుంచే ఇంటర్, డిగ్రీ, బీఈడీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో దీన్ని ప్రారంభించాలనుకుంది. తద్వారా ఈ విద్య సంస్థల్లో చదువుకునే దాదాపు 4 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతోందని ప్రభుత్వం భావించింది. ప్రభుత్వ స్కూళ్లల్లో మధ్యాహ్న భోజనం ఇప్పటికే అమలవుతోంది. అలాగే జూనియర్, డిగ్రీ, ఇతర కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం అమలు చేసి విద్యావ్యవస్థను మరింత పటిష్ట పరచాలని సదుద్దేశ్యంతో దీనిని ముందుకు తీసుకొచ్చినా నేటికీ అది మాత్రం కార్యరూపం దాల్చడంలేదు.

విద్యను అభ్యసించేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే విద్యార్థులు ఉదయమే బస్సుల్లో ప్రయాణించి తరగతులకు హాజరవుతుంటారు. ఈ క్రమంలో ఉదయం పూట వచ్చేటప్పుడు ఇంట్లో ఉన్నది తినిరావడం లేదంటే పస్తులతోనే క్లాసులకు హాజరై మధ్యాహ్నం తరువాత ఇంటికెళ్లడం చేస్తుంటారు. కొంత మంది విద్యార్థులు మాత్రం మధ్యాహ్నానికి టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటారు. కానీ మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికెళ్లే విద్యార్థులు తిరిగి తరగతులకు హాజరుకాకపోవడంతో పరీక్షల్లో ఫెయిల్ కావడం, డ్రాపౌట్ అవడం జరుగుతోంది. ఇది వారి జీవితంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఎదిగే వయస్సులో విద్యార్థులు సమయానికి భోజనం చేయకపోవడం వల్ల చాలారకాల ఆరోగ్య సమస్యలకూ గురవుతున్నారు. ఈ ప్రభావం ఎక్కువగా విద్యార్థినిలపై పడుతోంది. ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం తగ్గుతున్న క్రమంలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని ప్రభుత్వం అప్పట్లో నిర్ణయించింది. దీనికోసం మంత్రుల బృందం ఓ స్వచ్ఛంద సంస్థతో సంప్రదించి పథకాన్ని అమలుపర్చాలని కూడా భావించారు. దీని వల్ల కళాశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య పెరగడం, విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందని అనుకున్నారు. కానీ ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల ఈ పథకం అటకెక్కినట్లుగా తెలుస్తోంది.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 405 ఉండగా డిగ్రీ కాలేజీలు 125 ఉన్నాయి. జూనియర్ కాలేజీల్లో దాదాపు 2 లక్షల వరకు విద్యార్థులు చదువుతున్నారు. డిగ్రీ కాలేజీల్లోనూ దాదాపుగా 1.20 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇంకా బీఈడీ, డీఈడీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివేవారు మరో లక్ష వరకు ఉంటారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ సౌజన్యంతో ఈ పథకాన్ని కళాశాలల్లో అమలు చేయాలని అప్పట్లో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి నేతృత్వంలోని మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయించింది. కానీ అది ఇప్పటి వరకూ కార్యరూపం దాల్చలేదు. కనీసం వచ్చే విద్యా సంవత్సరం నుంచైనా దీన్ని అమలు చేయాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

శశికళను కలిసినందుకు 'పన్నీర్ సెల్వం, రాజ'లను పార్టీ నుండి బహిష్కరణ

చెన్నై, మార్చి 5:దివంగత ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళను కలిశారు అన్నాడీఎంకే అగ్రనేత పన్నీర్ సెల్వం, ఆయన సోదరుడు రాజ. దాంతో పార్టీ నుంచి వారిద్దరితో పాటు మరో ముగ్గురిని బహిష్కరిస్తున్నట్లు అన్నా డీఎంకే అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఏఐఏడీఎంకే సమన్వయకర్త పన్నీర్?సెల్వం, కోఆర్డినేటర్? కే పళనిస్వామి సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. రాజాతో పాటు పార్టీ నుంచి బహిష్కరణకు గురైనవారిలో తేని జిల్లా సాహిత్య విభాగం కార్యదర్శి ఎస్ మురుగేశన్, తేని జిల్లా మత్స్యకారుల విభాగం కార్యదర్శి వైగై కరుప్పుజీ, గూడలూరులోని జయలలిత పేరవై కార్యదర్శి ఎన్ సేతుపతి ఉన్నారు. బహిష్కరణకు గురైన నేతలతో పార్టీకి సంబంధించిన అంశాలను చర్చించరాదని అన్నాడీఎంకే అగ్ర నేతలు ఓ పన్నీర్‌సెల్వం, ఎడప్పాడి కె పళనిస్వామి కార్యకర్తలను ఆదేశించారు. మరోవైపు తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంపై ఓరాజా తేనిలో విలేకరులతో మాట్లాడుతూ.. అన్నాడీఎంకేకు ప్రస్తుతం శశికళ నాయకత్వం అవసరం ఉందని అన్నారు. తనను పార్టీ నుంచి బహిష్కరించడానికి వాళ్లేవరు.. అని పన్నీర్ సెల్వం, పళనిస్వామిలను ఉద్దేశించి తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు.

తాను పార్టీ వ్యవస్థాపకులైన ఎంజీ రామచంద్రన్ అప్పటి నుంచి పార్టీలో సభ్యునిగా ఉన్నానని చెప్పారు. తర్వాత జయలలిత నాయకత్వంలో పార్టీలో సభ్యునిగా ఉన్నానని తెలిపారు. తనకు శశికళ ప్రధాన కార్యదర్శి అని.. పార్టీ నుంచి తన బహిష్కరణ చెల్లదని చెప్పారు. శశికళతో భేటీలో ఏం చర్చించారని అడిగి ప్రశ్నపై సమాధానమిచ్చిన రాజా.. పార్టీని నడిపించాలని ఆమెను అభ్యర్థించినట్టుగా చెప్పారు. జయలలిత మరణానంతరం తమిళనాడులో అన్నాడీఎంకే పరిస్థితి దారుణ స్థితికి చేరింది. వరుస ఓటములతో ఉక్కిరిబిక్కిరి అయింది. ఆమె మరణం తర్వాత పార్టీని గుప్పిట్లోకి తీసుకున్న పన్నీర్ సెల్వం, పళనిస్వామిలు పార్టీని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీని తిరిగి గాడిలో పెట్టాలంటే శశికళకు పార్టీ బాధ్యతలు అప్పగించడం మేలన్న అభిప్రాయాన్ని అటు నేతలు, ఇటు కార్యకర్తలు వెల్లడిస్తున్నారు. ఇందుకు పన్నీరు సెల్వం వర్గం నుంచి సానుకూల సంకేతాలు వస్తున్న.. పళనస్వామి మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మరి ఏం జరగనుందో చూడాలి.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ప్రభుత్వ విప్

నల్గొండ, మార్చి 5:పల్లెల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. జిల్లాలోని తుర్కపల్లి మండలం వెల్లుపల్లి, దత్తాయ పల్లి, వెంకటాపూర్, దెయ్యం బండ, తుర్కపల్లి, మల్కాపూర్, బద్దుతండా, బిల్యా తండా,ముల్కలపల్లి, జేతి రామ్ తండా, సంగ్య తండా, రాంపూర్ పూర్, గ్రామాలలో ఎస్ బి ఎఫ్ నిధుల కింద మంజూరైన అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే పార్టీ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ.. గ్రామాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి గ్రామ పంచాయతీకి రూ. 25 లక్షల రూపా యలు మంజూరు చేశారన్నారు. ముఖ్యవ ంత్రి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తోందని, ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామాల అభివృద్ధి కమిటీలతో కలసి గ్రామ సమస్యలను పరిష్కరించుకోవాలని అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని, దత్తాయపల్లి గ్రామానికి స్పెషల్ అధికారిని నియమించి ప్రణాళికతో పాటు గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి పరుచుకోవడానికి కలెక్టర్ తో మాట్లాడి అభివృద్ధి పనులు చేసుకుందామన్నారు. ముఖ్యమంత్రి గ్రామాల అభివృద్ధి దృష్టిలో ఉంచుకొని 25 లక్షల రూపాయలు నిర్మా ణాల కోసం నిధ ులు మంజూరు చేశారన్నా రు. కరోనా సమయంలో పేద ప్రజలకు చేయూత నిచ్చే పథకాలను అందజేస్తున్నామని, ఎమ్మెల్యే ఫండ్ ఎవరికీ ఇవ్వకుండా ముఖ్యమంత్రి ముందుచూపుతో ప్రణాళిక ప్రకారం ప్రజలందరికీ చేరవేశారని, ముఖ్యమంత్రి పరిపాలనలో తాను భాగస్వామ్యం కావడం తన అదృష్టమన్నారు. అన్ని కులాలకు ప్రభుత్వం చేయూత నిచ్చే సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బిక్కు నాయక్, ఎంపీపీ భూక్య సుశీల రవీందర్ నాయక్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, కో ఆప్షన్ షరీఫ్, ఎంపీటీసీలు పలుగుల నవీన్ కుమార్, గిద్దె కర్ణాకర్, బోరెడ్డి వనజ, టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి, సర్పంచులు రామ్మోహన్ శర్మ, కల్లూరి ప్రభాకర్ రెడ్డి, పడాలవనిత శ్రీనివాస్, అమల బాలకృష్ణ, రమేష్, ఇమ్మడి మల్లప్ప, జ్యోతి, లలితశ్రీనివాస్, బబ్బురి రవీందర్ గౌడ్, రాజయ్య, బద్దు నాయక్, పత్తిపాటి మంజుల, పాల్గొన్నారు.

నేటి నుంచి మల్లన్న స్పర్శ దర్శనం ప్రారంభం

కర్నూలు, మార్చి 5:: ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో ఇవాల్టి నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభమయ్యాయి. గర్భాలయ అభిషేకం, కుంకుమార్చన, ఆర్జిత సేవలు నిర్వహిస్తారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగియడంతో.. శ్రీశైలంలో ఆర్జిత సేవలతో పాటు మల్లన్న స్పర్శ దర్శనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో కరెంట్, ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఆర్జిత సేవల టికెట్లు అందుబాటులోకి వచ్చాయి.

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నాడు అత్యంత వైభవంగా ముగిశాయి. ఉత్సవాలలో చివరి రోజైన శుక్రవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవారు అశ్వవాహనంపై కొలువుదీరి పూజలందుకున్నారు. రాత్రి 10 గంటలకు స్వామి అమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా ఏకాంత సేవతో 11 రోజుల పాటు వైభవంగా జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కాగా, రేపటి నుంచి రోజుకు మూడుసార్లు సామూహిక అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ లవన్న తెలిపారు.

ఇవాల్టి నుంచి మల్లన్నస్వామి స్పర్శ దర్శనం చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో స్పర్శ దర్శనంను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. భక్తుల సంఖ్యను అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శ వినిపించింది. బ్రహ్మోత్సవాలు ముగియగానే తిరిగి స్పర్శదర్శనం ప్రారంభించారు.

ఈనెల 11 నుంచి పాదయాత్ర చేపట్టనున్న వైఎస్ షర్మిల

హైదరాబాద్, మార్చి 5: వైఎస్ఆర్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాదయాత్రను మళ్లీ ప్రారంభించనున్నారు. పాదయాత్రను ఈనెల 11 నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చాటడానికి వైఎస్ షర్మిల తీవ్రంగా శ్రమిస్తున్నారు. తెలంగాణ సర్కార్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఉద్యోగాలు భర్తీ చేయాలని నిరుద్యోగులకు మద్దతుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు.

రాష్ట్రంలోని 90 నియోజకవర్గాలు 14 పార్లమెంట్ నియెజకవర్గాల్లో 400 రోజుల పాటు 4వేల కిలోమీటర్ల పరిధి లక్ష్యంగా గతేడాది అక్టోబర్ 20న ప్రజాప్రస్థానం పాదయాత్ర చేపట్టారు. జిల్లాల్లో పర్యటిస్తూ.. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. తెరాస ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. స్థానిక సంస్థల ఎన్నికలు, కరోనా కారణంగా నవంబర్9న ఈ పాదయాత్ర వాయిదా పడింది.

అంబర్‌పేట్‌లో బోల్తా పడ్డ లారీ.. భారీగా ట్రాఫిక్ జామ్

హైదరాబాద్, మార్చి 5: నగరంలోని అంబర్‌పేట్‌లో శనివారం ఉదయం ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన లారీ అదుపుతప్పి బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లారీలో ఇటుకలను తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరో లారీలోకి ఇటుకలను తరలించారు.

ఈ మార్గంలో ఫ్లై ఓవర్ పనులు జరుగుతుండటం, లారీ బోల్తా పడటంతో.. భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బోల్తా పడ్డ లారీని క్రేన్ సాయంతో రోడ్డు పక్కకు తరలించారు.

జైలుకు వెళ్లినా.. బుద్ధి మారలె

-చోరీలకు పాల్పడుతున్న పాతనేరస్తుడి అరెస్ట్

1.2కిలోల గంజాయి,12 గ్రాముల బంగారం స్వాధీనం

హైదరాబాద్, మార్చి 5: తాళం వేసి ఉన్న ఇండ్లలో చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని కార్ఖాన పోలీసులు అరెస్టు చేశారు. నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ చందనా దీప్తి వివరాలు వెల్లడించారు. జీడిమెట్ల సుభాష్‌నగర్ కాలనీకి చెందిన మహ్మద్ అహ్మద్ పాష (26) గతంలో బోయిన్‌పల్లి, తిరుమలగిరి, మేడ్చల్, జవహర్ నగర్, జీడిమెట్ల, కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇండ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలు చేశాడు. రెండు సార్లు జైలుకు కూడా వెళ్లివచ్చాడు.

అయినా అతడిలో మార్పు రాలేదు. తాజాగా కార్ఖానా పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 1.2 కిలోల గంజాయి, హశీశ్ ఆయిల్ ప్యాకెట్, 12 గ్రాముల బంగారు ఆభరణాలు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

ఏపీ హైకోర్టు తీర్పుపై అసెంబ్లీలో చర్చించాలి : వైసీపీ ఎమ్మెల్యే

అమరావతి, మార్చి 5:ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పై ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును అసెంబ్లీ తీవ్రంగా చర్చించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు ప్రభుత్వానికి లేఖ రాశారు.

రాజధాని మార్చేందుకు కాని, మూడు రాజధానులుగా విభజించేందుకు శాసనాధికారం లేదని హైకోర్టు జడ్జిమెంట్‌పై ఆయన వ్యాఖ్యలు చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో శాసన, న్యాయ, కార్యనిర్వాహక వర్గాల మధ్య ఉన్న అధికారాలపై చర్చించేందుకు ప్రత్యేకంగా అసెంబ్లీ ని ఏర్పాటు చేయాలని ఏపీ సీఎం జగన్‌కు లేఖ రాశారు. రాజ్యాంగంలో డాక్ట్రిన్ ఆఫ్ సెపరేషన్ ఆఫ్ పవర్స్ పేరుతో శాసన, న్యాయ, కార్య నిర్వాహక వ్యవస్థల పరిధిని స్పష్టంగా పేర్కొన్నారని లేఖలో వివరించారు. శాసనాలను తయారు చేయడం, విధి విధానాలను రూపొందించడం శాసనసభ హక్కు అని , దానిని కాదనడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. కాగా ఎమ్మెల్యే ధర్మాన ప్రసాద్‌రావు లేఖపై బీఏసీలో చర్చిస్తామని ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీ హక్కులపై చర్చించాలని శాసన సభ్యులు కోరుకుంటున్నారని ఆయన వివరించారు.

Ministry of Culture
Government of India
Azadi Ka Amrit Mahotsav

సాహిత్య అకాదెమి
మరియు
తెలుగు విభాగం,
యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, (అటానమస్)
కాకతీయ విశ్వవిద్యాలయం, సుబేదారి, వరంగల్.
Re-accredited with 'A' Grade by NAAC
సంయుక్త నిర్వహిస్తున్న
తెలంగాణ ఉద్యమ సాహిత్యం
ఒకరోజు సదస్సుకు సాహితీప్రియులందరికీ ఆహ్వానం
బుధవారం, 9 మార్చి, 2022
వేదిక : యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, సుబేదారి, వరంగల్
కార్యక్రమం
ప్రారంభ సమావేశం : ఉదయం గం॥ 9.30
స్వాగతం : ఎస్.పి. మహాలింగేశ్వర్, ప్రాంతియ కార్యదర్శి
సభాధ్యక్షులు : బన్న అయిలయ్య, జనరల్ కౌన్సిల్ మెంబర్, సాహిత్య అకాడమి
ముఖ్య అతిథి : తాటికొండ రమేశ్, వైస్ చాన్సలర్, కాకతీయ విశ్వవిద్యాలయం
ప్రత్యేక అతిథి : జూలూరు గౌరీశంకర్, అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమి
సభా ప్రారంభకులు : కె. శివారెడ్డి, సంచాలకులు, తెలుగు సలహా మండలి, సాహిత్య అకాడమి
కీలకోపన్యాసం : సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కవి, విమర్శకులు
గౌరవ అతిథి : అంపశయ్య నవీన్, సభ్యులు, తెలుగు సలహా మండలి, సాహిత్య అకాడమి
మొదటి సమావేశం : ఉదయం గం॥ 11.00-1.00కు
అధ్యక్షులు : పిల్లలమర్రి రాములు / తెలంగాణ ఉద్యమ కవిత్వం
పత్ర సమర్పకులు : కరిమిళ్ళ లావణ్య / తొలిదశ తెలంగాణ ఉద

వైద్య విద్యా హబ్‌గా తెలంగాణ

హైదరాబాద్, మార్చి 5: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో కేవలం 5 ప్రభుత్వ వైద్య కళాశాలలు మాత్రమే ఉన్నాయి. అందులో ఉస్మానియా మెడికల్ కాలేజీ, గాంధీ మెడికల్ కాలేజీ, కాకతీయ మెడికల్ కాజలేజీతోపాటు ఆదిలాబాద్, నిజామాబాద్‌లో మెడికల్ కాలేజీలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సిద్దిపేట, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్‌లో కొత్తగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసింది.

ఈ 9 మెడికల్ కాలేజీల్లో కలిపి 1200 ప్రభుత్వ ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక ప్రస్తుతం14 కొత్త మెడికల్ కాలేజీలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించగా మరో 2 చోట్ల(కరీంనగర్, ఖమ్మం జిల్లా కేంద్రం)లో ప్రతిపాదన దశలో ఉన్నాయి. ఇప్పటికే ఉన్న 9, త్వరలో ఏర్పాటు చేయనున్న 16 మెడికల్ కాలేజీలను కలుపుకుంటే రాష్ట్ర ప్రభుత్వ యజమాషీలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల సంఖ్య 25కు చేరింది. ప్రస్తుతం ఉన్న 9 మెడికల్ కాఏలజీల్లో 1640 సీట్లు, కొత్తగా ప్రకటించిన 16 మెడికల్ కాలేజీల్లో 2400 సీట్లను కలుపుకుంటే మొత్తం 4040 ఎంబీబీఎస్ సీట్లు కన్వీనర్ కోటాలో విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కొత్త మెడికల్ కాలేజీకి అనుబంధంగా 330 పడకల ఆసుపత్రి ఉండాలి ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆయా జిల్లా ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేస్తున్నారు.

ఆసుపత్రుల్లోని బెడ్స్ ను పెంచటం తోపాటు ఇతర అవస్థాపనా సౌకర్యాలు కల్పించనున్నారు. కొత్త మెడికల్ కాలేజీలు, వాటికి అనుబంధంగా అప్‌గ్రేడ్ అయిన జిల్లా ఆసుపత్రులు అందుబాటులోకి వస్తే పేద, సామాన్య రోగులకు అత్యాధునిక వైద్య సేవలు వారి సమీప ప్రాంతంలోనే అందుబాటులోకి రానున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి కూడా రోగులు , వైద్య విద్యార్థులు తెలంగాణకు వచ్చే అవకాశం ఉంది. వైద్యం కోసం పేదలు ప్రయివేటుకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏకంగా 80శాతం మేర తగ్గనున్నాయి. కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు కోసం ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసి మరీ నిధులను సమీకరించనున్నారు. ఒక్కో మెడికల్ కాలేజీకి రూ.500 కోట్ల దాకా ఖర్చు అవనుంది. ప్రస్తుత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే కార్పోరేషన్ ఏర్పాటును ప్రకటించే అవకాశం ఉందని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

సీఎం కేసీఆర్, వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి హరీష్‌రావు నేతృత్వంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యరంగం గణనీయంగా మెరుగవుతోంది. అందులో భాగంగా కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు నిర్ణయం విప్లవాత్మకమైనది. పేద, సామాన్య రోగులకు మెరుగైన ప్రభుత్వ వైద్య అందనుంది. ప్రయివేటులో వైద్యంతో అప్పులపాలవ్వాల్సిన పరిస్థితులు గణనీయంగా తగ్గుతాయి. ఎందరో పేద, మధ్యతరగతి విద్యార్థులు డాక్టర్లు అయ్యే అవకాశం ఉంటుంది. ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల నుంచి కూడా విద్యార్థులు వైద్య విద్య కోసం తెలంగాణకు రానున్నారు. వైద్య ఆరోగ్యరంగంలో ఎన్నో పరిశోధనలు జరిగేందుకు అవకాశం ఉంటుంది.

కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చొరవ చూపాలి

రాజన్న సిరిసిల్ల, మార్చి 5 (నేటినిజం ప్రతినిధి):కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని వేములవాడ కళానికేతన్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు యె ల్ల పోశెట్టి అన్నారు .శనివారం తెలంగాణ ట్రెడిషనల్ ఆర్ట్స్ ఫిలిం టీవీ డిజిటల్ డెవలప్మెంట్ అసోసియేషనటీ టీ ఎఫ్ టీ జేఏసీ ఆధ్వర్యంలో వేములవాడ నృత్య కళానికేతన్ సంస్థ ప్రధాన కార్యాలయం నందు సమావేశం జరిగింది.తెలంగాణ రాష్ట్రంలో జానపద వారసత్వ, ఆధ్యాత్మిక, కళారూపాలను పునరుజ్జీవం చేసుకోవాలని, అట్టి కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చొరవ చూపి వారికి కనీస మౌలిక సౌకర్యాలు విద్య వైద్య గృహ వసతులను కల్పించాలని, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సినిమా పరిశ్రమలో విభజన చట్టాలు అమలు కాకపోవడం వల్ల తెలంగాణ ప్రాంత లక్షలాది కళాకారుల టెక్నీషియన్స్కు కు ఉపాధి అవకాశాలు అందడం లేదని, అందువల్ల తెలంగాణ సినీ పరిశ్రమలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వేములవాడ కళానికేతన్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు యెల్ల పోచేట్టి గారు మాట్లాడుతూ కళలను ప్రోత్సహించాలి, కళాకారులను బతుకులు బాగుండాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. మురళీధర్ దేశ్ పాండే, ప్రొఫెసర్ సుదర్శన్ రావు, ఫిలిం డైరెక్టర్ అశోక్ కుమార్, నాథమునుల రామారావు , తారాచంద్, బాలకిషన్, మేకల శ్రీనివాస్ యాదవ్ ,మోహన్ యాదవ్, వైద్యుల రజితా రెడ్డి.. సంస్థ అధ్యక్షుడుగంగా శ్రీకాంత్ ,

ప్రధాన కార్యదర్శి మానువాడ లక్ష్మీనారాయణ, సంస్థ గౌరవ అధ్యక్షులు కనపర్తిహనుమాన్,వారాల దేవయ్య, బొడ్డు రాములు, గడ్డం సుధాకర్ , మారం ప్రవీణ్ వెదిరే రవి ,కె. రాధిక , భైరి మల్లేష్ యాదవ్ , భాశ్వంత్ శర్మ , ఆకునూరి సురేష్ ,సిహెచ్ పద్మారావు, విజయ్ కుమార్, కనికరం అనిల్ కుమార్, అన్నవరపు హరీష్ కుమార్... తదితర కళాకారులు పాల్గొన్నారు

చిరుత పులి దాడిలో రెండు బర్రె దూడలు మృతి

వికారాబాద్,మార్చి 5:కుల్కచర్ల మండలం అనంతసాగర్‌లో చిరుత కలకలం సృష్టించింది. చిరుతపులి దాడిలో రెండు బర్రె దూడలు మృతి చెందాయి. దీంతో అనంత సాగర్ గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. చిరుత సంచారంపై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిరుత సంచారంతో ఇండ్ల నుంచి బయటకు వెళ్లాలంటే భయమేస్తోందని గ్రామస్తులు వాపోయారు.

పిల్లలతో కలిసి బావిలో దూకేసిన తల్లి.. అది యాక్సిడెంటల్‌గా జరిగిందంటున్న పోలీసులు

కర్నూలు, మార్చి 5:: కుటుంబ కలహాలతో ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో సహా శనివారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కర్నూలు మండలం పూలతోట గ్రామంలో చోటుచేసుకుంది. ఈ విషాద ఘటనలో ఐదేళ్ల లోపు పిల్లలు సుచరిత, పునీత్‌రెడ్డి ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. తల్లి మౌనిక ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. అయితే.. ఇది అనుకోకుండా జరిగిన ఘటన అని పోలీసులు తెలిపారు.

తల్లి బట్టలు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు పిల్లలిద్దరూ బావిలోకి జారిపోయారని కర్నూలు తాలూకా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కంబగిరి రాముడు తెలిపారు. ఆమె వారిని రక్షించేందుకు ప్రయత్నించింది. ఈ ఆకస్మిక ఘటనలో ఆమె కూడా బావిలో పడగ స్థానికులు రక్షించి ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

కేటీఆర్ పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టు

రాజన్న సిరిసిల్ల, మార్చి 5 (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు వేములవాడ పర్యటన సందర్భంగా మిడ్ మానేర్ ఐక్యవేదిక నాయకులను శుక్రవారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో అరెస్టు చేసి వేములవాడ పోలీస్ స్టేషన్ నుండి కోనరావుపేట పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది కేటీఆర్ మిడ్ మానేరు నిర్వాసితులకు ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ముంపు గ్రామాల ఐక్యవేదిక తరపున తెలియజేయడం జరిగింది పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లి కనకయ్య రుద్రవరం ఎంపీటీసీ గాలి పెల్లి సువర్ణ స్వామి గౌడ్ బీజేపీ వేములవాడ అర్బన్ మండల ప్రెసిడెంట్ ఎర్రం నర్సయ్య ,కొడుముంజ సర్పంచ్ కుదిరే రాజు కుమార్ శభాష్ పల్లె సర్పంచ్ పండుగ ప్రదీప్, అనుపురం ఎంపీటీసీ బస రాజశేఖర్ వేములవాడ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కసర్ల అరుణ్ కుమార్ బీజేపీ రుద్రవరం గ్రామ ప్రెసిడెంట్ సింగిల్విండో డైరెక్టర్ గొనె భాస్కర్ కాంగ్రెస్ గ్రామ ప్రెసిడెంట్ కత్తి కనకయ్య కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల మల్లేశం,పలువురు నాయకులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి - డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, మార్చి 5 (నేటినిజం ప్రతినిధి):అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ అధ్యాపకుల సంఘం టిజి సీజీటిఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ , మధు రాజేష్ అన్నారు. స్థానిక అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ, పీ.జీ. కళాశాలలో శనివారం నాడు నిర్వహించిన ఒక కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల బలోపేతానికి అధ్యాపకులంతా సమిష్టి కృషి చేసి మంచి ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. తదనంతరం సంఘపు దైనందిని డైరీ, కాలమాణిని క్యాలండర్ కళాశాల ప్రిన్సిపల్ డా. వడ్లూరి శ్రీనివాస్ ,అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సంఘపు యూనిట్ అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి డా.బి.ఉపేందర్ రెడ్డి, కోశాధికారి డా.ప్రభాకర్, కళాశాల అధ్యాపకులు డా.ఆఫ్సారీ ఉస్మానీ, డా.రమాదేవి, శ్రీనివాస్, రాజేష్, నారాయణ, నర్సయ్య, అరవింద్, మధు బాబు, దీపిక తదితరులు పాల్గొన్నారు.

భారతీయుల కోసం ఉక్రెయిన్‌లోనే ఉండిపోయిన డాక్టర్

కీవ్, మార్చి 5:: ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయులు ఎప్పుడెప్పుడు ఇండియా వచ్చేద్దామని ఆలోచిస్తుంటే, ఒక భారతీయ డాక్టర్ మాత్రం అందరినీ ఇండియాకు పంపించిన తర్వాతే తిరిగొస్తానంటున్నాడు. ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయ విద్యార్థులందరూ తిరిగి వెళ్లాకే, తాను ఆ దేశాన్ని వీడతానంటున్నాడు. కోల్‌కతాకు చెందిన పృథ్వీరాజ్ ఘోష్ ఉక్రెయిన్‌లో డాక్టర్‌గా, స్టూడెంట్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం భారతీయుల్ని తెచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి ఒక్కరూ స్వదేశానికి తిరిగొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, పృథ్వీరాజ్ ఘోష్ మాత్రం ఇప్పుడప్పుడే తాను ఉక్రెయిన్ వదలనంటున్నాడు. అక్కడ చదువుకుంటున్న భారతీయుల్లో తన స్టూడెంట్లు చాలా మంది ఉన్నారని, వాళ్లందరిని క్షేమంగా స్వదేశానికి పంపించడం తన బాధ్యత అంటున్నాడు.

'నిజానికి నేను ఇక్కడ చిక్కుకుపోలేదు. కావాలనే ఉండిపోయా. ఇక్కడ చిక్కుకున్న భారతీయులందరినీ ఇండియాకు పంపించేందుకు ప్రయత్నిస్తా. ఇప్పటికే 350 మందికిపైగా విద్యార్థులకు సాయం చేశా. సుమి, ఖార్కివ్‌తోపాటు చాలా ప్రాంతాల్లో రెండు వేలకుపైగా విద్యార్థులు చిక్కుకున్నారు. వాళ్లందరికీ సాయం చేస్తా. వాళ్లకు ఇక్కడ నేను తప్ప ఎవరూ లేరు. నన్నే నమ్ముకొని ఉన్నారు. వాళ్లని వదిలి ఎలా వస్తా. అందరినీ పంపించాకే తిరిగొస్తా' అంటూ పృథ్వీరాజ్ తన పేరెంట్స్‌తో వీడియో కాల్‌లో చెప్పారు. పృథ్వీరాజ్ నిర్ణయంపై ఇండియాలో ఉన్న అతడి తల్లిదండ్రులు ఒకవైపు గర్వపడుతూనే, మరోవైపు ఆందోళనకు గురవుతున్నారు. తమ కొడుకుతోపాటు, ఇతర విద్యార్థులంతా క్షేమంగా తిరిగి రావాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నామని చెప్పారు

శాసన సభలో ప్రతి అంశంపై చర్చ జరగాలి: స్పీకర్ పోచారం

హైదరాబాద్, మార్చి 5:తెలంగాణ శాసన సభ, శాసన మండలి సమావేశాలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 7వ తేదీ నుండి ప్రారంభం కానున్నసమావేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ అధికారులతో శాసనసభ భవనంలోని కమిటీ హాల్ శాసనసభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి సమావేశం నిర్వహించారు. శాసనమండలి ప్రోటెం చైర్మన్ సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రి, శాసనసభలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, లెజిస్లేటివ్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు. చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఫైనాన్స్) రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఎంఏ యుడి) అరవింద్ కుమార్, ప్రిన్సిపల్ సెక్రటరీ (జీఏడీ) వికాస్ రాజ్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రమేష్ రెడ్డి,జీహెచ్ఎంసి కమిషనర్ లోకేష్ కుమార్,డీజీపి. మహేందర్ రెడ్డి, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ-రవిగుప్తా, హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనర్ -సి.వి అనంద్, సైబరాబాద్ పోలీసు కమిషనర్-స్టిఫెన్ రవీంద్ర, రాచకొండ పోలీసు కమిషనర్-మహేష్ భగత్, డీఐజీ (ఇంటలిజెన్స్)- శివకుమార్, అసెంబ్లీ ఛీఫ్ మార్షల్- కరుణాకర్ తదతరులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుండి తెలంగాణ రాష్ట్ర రెండవ శాసనసభ 8వ సెషన్ సమావేశాలు, శాసనమండలి 18వ సెషన్ సమావేశాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాల హుందాతనాన్ని కాపాడుకుంటూ ప్రతి అంశంపై సమగ్రంగా చర్చించాలని అన్నారు. అసెంబ్లీ సమావేశాలు పారదర్శకంగా జరగడానికి గత సమావేశాలలో లాగానే ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలి. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైన ంత త్వరగా అందించాలని అధికారులను ఆదేశించారు.గత సమావేశాలకు సంబంధించిన పెండింగులో ఉన్న ప్రశ్నలకు జవాబులను వెంటనే పంపించాలని ఆయన ఆదేశించారు.కరోనా ప్రభావం తగ్గినప్పటికి ఇంకా పూర్తిగా పోనందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాస్క్ దరించాలి. ఎవరికైనా లక్షణాలు ఉంటే నిర్ధారణ చేయడానికి వైద్య ఆరోగ్య శాఖ వారు కరోనా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని అన్నారు. సభ ప్రశాంతంగా జరగాలంటే బయట శాసనసభ పరిసర ప్రాంతాలు కూడా ప్రశాంతంగా ఉండాలని అన్నారు.గతంలోని సమావేశాలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి, ఈసారి కూడా అదేవిధంగా జరగడానికి పోలీసు శాఖ తరుపున పూర్తి సహాయ, సహకారం అందించాలని కోరారు.

వేములవాడలో సిటీ స్కాన్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, మార్చి 5 (నేటినిజం ప్రతినిధి):రాష్ట్ర మంత్రి కేటీఆర్ వేములవాడలో పర్యటిస్తున్నారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్, ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన పిడియాట్రిక్ వార్డు అండ్ పొలియేటివ్ కేర్ సెంటర్, టీబీ రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ తో పాటు స్థానిక ఎమ్మెల్యే రమేష్ బాబు ఉన్నారు.

రాజన్న ఆలయ ఉద్యోగుల కు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా హెల్త్ స్కీం అమలు పరుచుటకు మంత్రి కే టి ఆర్ కు వినతి పత్రం అందజేసిన రాజన్న ఉద్యోగ సంఘాల నాయకులు ...

శనివారం పలు అభివృద్ధి పనుల గురించి వేములవాడ వచ్చిన జిల్లా మంత్రి కే టి రామారావు ని రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉపాధ్యాయుల చంద్ర శేఖర్ ,గౌరవ అధ్యక్షులు సిరిగిరి శ్రీరాములు మరియు పర్యవేక్షకులు నటరాజ లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్సి లడ్డు ప్రసాదం అందజేసి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఆలయ ఉద్యోగుల కు కూడా హెల్త్ స్కీమ్ అమలు పరచాలని వినతిపత్రం అందజేయగా మంత్రి కేటిఆర్ సానుకూలంగా స్పందించారు.

ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేయడంలో ఆరితేరిన మోడీ - మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

సంగారెడ్డి, మార్చి 5 (నేటి నిజం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం కార్పొరేటైజేషన్ చేస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేయడంలో ఆరితేరినందున ఆయనకు ప్రపంచంలోనే పెద్ద గ్లోబల్ అవార్డు ప్రధాని మోడీకి ఇవ్వాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డి డీసీఎంఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉన్న ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ పెద్ద ఎత్తున ఉద్యోగాలు తొలగిస్తూ నిరుద్యోగులుగా మారుస్తున్నారని ఆరోపించారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 1983లో మెదక్ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసి ఓడీఎఫ్ పరిశ్రమను ఏర్పాటు చేశారని.. జిల్లా ప్రజల నుంచి 32 వేల ఎకరాలు తీసుకుని పెద్ద ఎత్తున స్థానికులకు ఉద్యోగాలు కల్పించారని దాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు పరం చేయడం వల్ల 8వేల మంది ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చిందని ఆరోపించారు. లాభాల్లో ఉన్న సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారని.. మెదక్ జిల్లాలో ఉండే బీహెచ్ఈఎల్, ఓడిఎఫ్ పరిశ్రమలను ప్రైవేటుపరం చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను పీకేస్తుంటే.. రాష్ట్ర బీజేపీ నాయకులు టీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదని ఆందోళన చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలు పీకేస్తుంటే వారికి కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో నలుగురు ఎంపీలు, ఒక కేంద్ర మంత్రి ఉన్న ఎందుకు స్పందించలేదని విమర్శించారు. ఓడీఎఫ్ పరిశ్రమను ప్రైవేటీకరణ చేశారని.. దానికి అనుబంధంగా ఉన్న ఆస్పత్రిని మాత్రం యాజమాన్యం తమకు సంబంధం లేదంటూ చేతులెత్తేయడంతో అందులో పని చేస్తున్న డాక్టర్లు, నర్సులు, సిబ్బంది ఉద్యోగాలు పోయే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా టీఆర్ఎస్ ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని పార్లమెంట్లో నిలదీస్తామన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రికి వినతిపత్రం

రాజన్న సిరిసిల్ల, మార్చి 5 (నేటినిజం ప్రతినిధి):వేములవాడలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవానికి కార్యక్రమాలకు విచ్చేసిన మంత్రి కేటీఆర్ కు ముంపు గ్రామాల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలంటూ వేములవాడ అర్బన్ జడ్పీటీసీ మ్యాకల రవి తెలంగాణ రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు వినతి పత్రం అందజేశారు వెంటనే స్పందించిన మంత్రి వేములవాడ శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు సారథ్యం లో పూర్తి చేయమని పురపాలక×,

×ఐటీ శాఖ మాత్యులు కల్వకుట్ల తారక రామారావు కలెక్టర్ కి చెప్పడం జరిగింది. మంత్రి దాదాపు 95 శాతం పూర్తి అయినవి, ఇంకా మిగిలిన పూర్తి చేయమని చెప్పడం జరిగింది. కలెక్టర్ తొందరగా పూర్తి చేస్తామని మంత్రి కి చెప్పడం జరిగింది×.స్పందించిన కేటీఆర్ టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు చెప్పారు .ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మ్యాకల రవి ,ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు ,వైస్ ఎంపీపీ ఆర్ సిరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉరిడీ ప్రవీణ్ ,సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు ఉరిడీ రాంరెడ్డి,టీఆర్ఎస్ నాయకులు తాడం శ్రీనివాస్, హరికృష్ణ,మెడికల్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.